ప్రతి అక్షరం ప్రజాహితం

RNI No: APTEL -2023/89112 www.andhrapragathi.com

నేటి ఆంధ్రప్రగతి

తెలుగు దినపత్రిక

సంపుటి - 02 సంచిక -234 పేజీలు - 08 వెల - 04/- బుధవారం 25 జూన్ 2025




# ఇరాన్-ఇజ్రాయిల్ మధ్య ముగిసిన యుద్ధం

**కాల్పుల విరమణకు ఇరు దేశాలు అంగీకారం**

**కీలక ప్రకటన చేసిన అమెరికా అధ్యక్షుడు ట్రంప్**

న్యూయార్క్, **జూన్ 24 ఆంధ్ర ప్రగతి** ఇరాన్-ఇజ్రాయెల్‌యుద్ధంపై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ కీలక ప్రకటన జారీ చేశారు. యుద్ధం ముగిసిందంటూ ట్రంప్ పోస్ట్ పెట్టారు. కాల్పుల విరమణకు రెండు దేశాలు అంగీకరించాయని వెల్లడించారు. 24 గంటల్లో సీజ్ ఫైర్ అమలులోకి వస్తుందని చెప్పారు. 12 రోజుల యుద్ధానికి ఇది ముగింపు అని ప్రకటించారు. మిగతా 2లో...

# బనకచర్లతో తెలంగాణకు నష్టం లేదు



**దీనిపై దుష్ప్రచారాన్ని అడ్డుకోవాలి**

**తెలంగాణ వాడుకోగా మిగిలిన నీటినే వాడుకుంటాం**

**తెలంగాణ అనేక ప్రాజెక్టులు కడుతున్న అడ్డుకోవడం లేదు**

**కేబినేట్‌లో సిఎం చంద్రబాబు వెల్లడి**

అమరావతి, **జూన్ 24 ఆంధ్ర ప్రగతి**పోలవరం బనకచర్లపై తెలంగాణ నేతలు అందరూ మాట్లాడుతున్నారని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తెలిపారు. తెలంగాణ కేబినెట్‌లో బనకచర్లపై వాళ్లు డిస్కస్ చేశారని అన్నారు. ఏపీ కూడా మన వాదనలు వినిపించాలని సూచించారు. తెలంగాణ వాళ్లు అనుమతి లేని ప్రాజెక్ట్‌లను కూడా కడుతున్నారని సీఎం చంద్రబాబు గుర్తుచేశారు. ఇంకా చాలా ప్రాజెక్ట్‌లను వాళ్లు కడుతున్నారని తెలిపారు. తెలంగాణ వాడుకోగా మిగిలిన నీళ్లను మాత్రమే కదా ఏపీ వాడుకునేదని సీఎం చంద్రబాబు స్పష్టం చేశారు. తెలంగాణ నేతలు బనకచర్లపై రాజకీయం చేస్తున్నారని విమర్శించారు. వరద జలాలను మనం వాడుకుంటామని.. ఈ విషయాన్ని ప్రజలకు అర్థమయ్యే రీతిలో కూటమి నేతలు చెప్పాలని ఆదేశించారు.

మిగతాది 2లో...



# సింగయ్య మృతి కేసులో జగన్ కు నోటీసులు




# అమరావతిలో మరో 44వేల ఎకరాల సేకరణ

**మరో 9 అన్న క్యాంటీన్ల ఏర్పాటుకు, 4687 మినీ అంగన్వాడీల అప్‌గ్రేడ్‌కు ఆమోదం**

**కాగ్నిజెంట్ సంస్థ ఏర్పాటుకు విశాఖలో భూమి, రూ.1582 కోట్ల పెట్టుబడులకు ఓకే**

**టెన్నిస్ క్రీడాకారుడు సాకేత్ సాయికి డిప్యూటీ కలెక్టర్ ఉద్యోగం**

**పొగాకు కొనుగోలుకు రూ.273 కోట్లు, వచ్చే ఏడాది క్రాప్ హాలిడే**

**స్వర్ణాంధ్ర పి4పై త్వరలో కమిటీలు ఏర్పాటు**

**కేబినేట్‌లో పలు నిర్ణయాలు..వెల్లడించిన మంత్రి పార్థసారథి**





# ఐఏఎస్ ఆమ్రపాలికి క్యాట్‌లో ఊరట..

**ఏపీ నుంచి మళ్లీ తెలంగాణకు**

**నాలుగు నెలల క్రితం డీఓపీటీ ఉత్తర్వులతో ఏపీకి బదిలీ**

**ఆమ్రపాలి విజ్ఞప్తికి అనుకూలంగా క్యాట్ తీర్పు**



**అమరావతి జూన్ 24 ఆంధ్ర ప్రగతి**

ఐఏఎస్ అధికారిణి ఆమ్రపాలికి కేంద్ర పరిపాలన ట్రైబ్యునల్ (క్యాట్)లో ఊరట లభించింది. ఆమెను ఆంధ్రప్రదేశ్ కేడర్ నుండి తిరిగి తెలంగాణ కేడర్‌కు కేటాయిస్తూ క్యాట్ మంగళవారం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ పరిణామంతో ఆమె త్వరలోనే తెలంగాణ ప్రభుత్వంలో బాధ్యతలు చేపట్టే అవకాశం ఉంది.కేంద్ర సిబ్బంది, శిక్షణ వ్యవహారాల శాఖ (డీఓపీటీ) జారీ చేసిన ఉత్తర్వుల మేరకు ఆమ్రపాలి దాదాపు నాలుగు నెలల క్రితం ఆంధ్రప్రదేశ్ కేడర్‌కు వెళ్లారు. అయితే, దీనిని సవాల్ చేస్తూ, తనను తెలంగాణకు కేటాయించాలని కోరుతూ క్యాట్‌ను ఆశ్రయించారు. ఆమె పిటిషన్‌పై విచారణ జరిపిన క్యాట్, ఇరుపక్షాల వాదనలు విన్నది. అనంతరం, ఆమ్రపాలి అభ్యర్థనను పరిగణనలోకి తీసుకుంటూ ఆమెకు అనుకూలంగా తీర్పు వెలువరించింది.



# రైతును రాజు చేయడమే మా లక్ష్యం

**రైతునేస్తం సభలో సిఎం రేవంత్ రెడ్డి ఉద్వేగపేరిత ప్రసంగం**

**వ్యవసాయాన్ని పండగ చేసి చూపిస్తున్నాం**

**9 రోజుల్లో 9 వేలకోట్ల మొత్తాన్ని రైతుల ఖాతాల్లో జమ**

**కెసిఆర్ ఎగ్గొట్టిన 7వేల కోట్లను కూడా జమచేసి చూపాం**

**సన్నవడ్లకు 500 బోనస్ ఇస్తామని ఇచ్చిన ఘనత మా ప్రభుత్వానిదే**

**బనకచర్లకు తలూపిందే కెసిఆర్...దీనిపై అసెంబ్లీలో చర్చకు రావాలి**

హైదరాబాద్, **జూన్ 24 ఆంధ్ర ప్రగతి** :రైతు భరోసా కార్యక్రమాన్ని విజయవంతంగా పూర్తి చేశామని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. వ్యవసాయం అంటే.. రైతును రాజును చేయడం అని తెలుసన్నారు. రైతులకు అండగా నిలిచి, వారికి చేదోడువాదోడుగా కార్యక్రమాలు చేస్తున్నామని అన్నారు. మిగతాది 2లో...

# 'రాహుల్ రహస్య విదేశీ యాత్ర'...

**బీజేపీ, కాంగ్రెస్ మధ్య మాటల యుద్ధం**

**మేనకోడలి గ్రాడ్యుయేషన్ కోసమే వెళ్లారని కాంగ్రెస్ స్పష్టీకరణ**

**రాహుల్ తరచూ విదేశీ పర్యటనలపై బీజేపీ ఐటీ చీఫ్ మాలవీయ విమర్శ**



బీజేపీ ఐటీ విభాగం చీఫ్ అమిత్ మాలవీయ, రాహుల్ గాంధీ విదేశీ పర్యటనల తీరును తప్పుబడుతూ ఎక్స్ వేదికగా పలు ప్రశ్నలు సంధించారు. "రాహుల్ గాంధీ గత వారమే ఓ రహస్య విదేశీ పర్యటన ముగించుకువచ్చారు. ఇప్పుడు మళ్లీ మరో అజ్ఞాత ప్రదేశానికి విదేశాలకు వెళ్లారు" అని మాలవీయ తన పోస్ట్‌లో ఆరోపించారు. మిగతాది 2లో...
"ఈ తరచూ అదృశ్యమవ్వడాలు ఎందుకు?

# జగన్ కారణంగానే సింగయ్య మృతి

**వీడియో నిజాలను తప్పపట్టడం దారుణం**

**కాంగ్రెస్ బలోపేతం అందరికీ అవసరం**

**జిల్లా పర్యటనలో పిసిసి చీఫ్ షర్మిల**



# రాజధాని అమరావతిలో మరో 44వేల ఎకరాల సేకరణ

**అమరావతి, జూన్ 24 ఆంధ్ర ప్రగతి**రాజధాని రెండో విడత భూసేకరణను కేబినేట్ ఆమోదించింది. రాజధానిలో మరో 44వేల ఎకరాల సేకరణకు మంత్రి మండలి నిర్ణయం తీసుకుంది. స్వర్ణాంధ్ర పి4పై త్వరలో కమిటీలు ఏర్పాటు చేయడానికి ఓకే చెప్పింది. టెన్నిస్ ప్లేయర్ సాకేత్‌కు గ్రూప్-1 ఉద్యోగం ఇవ్వాలని కేబినెట్ నిర్ణయం తీసుకుంది. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధ్యక్షతన జరిగిన ఏపీ కేబినెట్ సమావేశంలో పలు అంశాలపై సుదీర్ఘంగా చర్చించారు.. కీలక నిర్ణయాలకు ఆమోముద్ర వేశారు.. మంత్రివర్గ సమావేశం ముగిసిన తర్వాత.. మీడియాతో మాట్లాడిన మంత్రి కొలుసు పార్థసారథి.. కేబినెట్‌లో తీసుకున్న నిర్ణయాలను వెల్లడించారు.. ఈ ఏడాదిలో 25 కేబినెట్ సమావేశాలు జరిగాయి.. కొన్ని వందల నిర్ణయాలు ఇప్పటి వరకు తీసుకున్నాం.. ఏపీ సీఆర్డీఏ ల్యాండ్ పూలింగ్ స్కీమ్ ప్రకారం మరో విడత భూ సమీకరణకు కేబినెట్ ఆమోదం తెలిపిందన్నారు. అమరావతిలో గ్రీన్ ఫీల్డ్ ఎయిర్‌పోర్ట్.. విద్యా సంస్థలు.. ఆస్పత్రులు అందించే విధంగా భవిష్యత్ అవసరాల కోసం.. ల్యాండ్ పూలింగ్ జరుగుతుందన్నారు.. 2015లో కూడా 35 వేల ఎకరాల ల్యాండ్ పూలింగ్ జరిగింది.. అసైన్‌మెంట్, భూముల విషయంలో స్థానిక అధికారులతో విచారణ తర్వాత భూ సమీకరణ జరుగుతుందన్నారు. అన్ని నియమ నిబంధనలు ప్రకారం.. ఆధార్, పాస్‌పోర్ట్ వివరాల ఆధారంగా ల్యాండ్ పూలింగ్ జరుగుతుంది.. రైతులకు సంబంధించి ల్యాండ్ పూలింగ్ కు ఇచ్చే వారికి మెరుగైన ప్యాకేజ్ అందిస్తున్నాం అన్నారు.. అమరావతిలో జీఏడీ టవర్.. హెచ్‌వోడీ టవర్.. ఎన్సీసీ షాపూర్‌జీ పల్లంజీకి, ఎల్ అండ్ టీకి టెండర్ ఆర్డర్ ఇవ్వడానికి కేబినెట్ ఆమోదం తెలిపిందన్నారు..

ఇక, మున్సిపల్ శాఖలో 40 టౌన్ ప్లానర్ పోస్టుల మంజూరుకు కేబినెట్ ఆమోదం తెలిపింది.. భవన నిర్మాణంలో ఉన్న సమస్యలకు పరిష్కారం కోసం మున్సిపల్ నిబంధనల సవరణకు కేబినెట్ ఆమోదం తెలిపిందన్నారు. టెన్నిస్ క్రీడాకారుడు మైనేని సాకేత్ కు డిప్యూటీ కలెక్టర్ ఉద్యోగం ఇచ్చేందుకు కేబినెట్ ఆమోదం తెలిపింది. గండికోట ప్రాంతంలో టూరిజం అభివృద్ధికి ప్రత్యేక చర్యలు తీసుకునేలా సీఎం చంద్రబాబు ఆదేశాలు ఇచ్చారు. కరోన వల్ల నిర్మాణ సంస్థల పనులు నిలిచి పోయాయి.. కరోన వల్ల వ్యాపారం దెబ్బ తిన్న కాంట్రాక్టర్లకు పనులకు సంబంధించిన టెండర్లలో ప్రాధాన్యత ఇచ్చేలా కేబినెట్ నిర్ణయం తీసుకుందన్నారు.. పోలవరం ప్రాజెక్ట్ 2027లో పూర్తి అయ్యేలా చర్యలు తీసుకోవాలని సీఎం చంద్రబాబు అధికారులను సూచించారని తెలిపారు. . ఇక, బనకచర్ల ప్రాజెక్ట్ కు సంబంధించి చర్చ జరిగింది. రెండు రాష్ట్రాలకు నష్టం జరగకుండా వృథాగా పోయే నీటిని రెండు రాష్ట్రాల సంక్షేమం దృష్టిలో పెట్టుకుని నిర్ణయం తీసుకోవాలని సీఎం ఆలోచన. ఎవరికి నష్టం చెయ్యాలని. హక్కులు తీసుకోవాలని ఆలోచన లేదని స్పష్టం చేశారు.. అమరావతిలో కన్వెన్షన్ సెంటర్ ఏర్పాటుకు సీఎం సూచన చేశారు.. విజయవాడలో డాక్టర్ బీఆర్ అంబేద్కర్ విగ్రహం ప్రాంతంలో సాంస్కృతిక శాఖకు బాధ్యతలు అప్పగిస్తూ కేబినెట్ నిర్ణయం తీసుకుంది. అమరావతిలో స్టార్ హోటల్ నిర్మాణానికి ఎస్ఐపీబీ ప్రతిపాదనలకు కేబినెట్



ఆమోదం తెలిపిందని మంత్రి కొలుసు పార్థసారథి వెల్లడించారు.. రెవెన్యూ సమస్యలను ఏడాదిలోపు పరిష్కరించాలని సీఎం చంద్రబాబు ఆదేశించారు. ఎక్కువగా రెవెన్యూ సంబంధిత సమస్యలు వస్తున్నాయని చెప్పుకొచ్చారు. అన్నక్యాంటీన్లను ప్రతి నియోజకవర్గ కేంద్రంలో ఏర్పాటు చేయాలని నిర్దేశిరచారు. అన్న క్యాంటీన్లను మానిటర్ చేయడానికి, ఎవరైనా విరాళాలు ఇస్తే తీసుకోవడానికి ఒక కమిటీని వేయాలని చంద్రబాబు సూచించారు. అనకాపల్లిలో ఆర్సెల్ మిట్టల్ స్టీల్‌కు సెప్టెంబర్‌లో శంకుస్థాపన చేసే విధంగా చూడాలని సీఎం చంద్రబాబు ఆదేశించారు. పంటలకు గిట్టుబాటు ధరలు కల్పిస్తున్నామని చెప్పుకొచ్చారు. జాతీయ స్థాయిలో కొన్ని పంటలకు డిమాండ్ లేకపోవడంతో మనం మార్కెట్‌లోనే కొంటున్నామని స్పష్టం చేశారు. పొగాకుకు మార్కెట్‌లో ధర తక్కువగా ఉండటంతో రూ. 250 కోట్లు కేటాయించామని అన్నారు. పొగాకును మార్క్‌ఫెడ్ ద్వారా కొనుగోలు చేస్తున్నామని పేర్కొన్నారు సీఎం చంద్రబాబు. ధరల స్థిరీకరణ నిధి ద్వారా పొగాకు, మామిడి, కోకో పంటల రైతులను ఆదుకుంటున్నామని ముఖ్యమంత్రి చంద్రబాబు తెలిపారు. తేమ శాతం ఎక్కువ ఉందనే కారణంతో పొగాకుకు మార్కెట్‌లో డిమాండ్ తక్కువ ఉన్నా మనం చొరవ తీసుకుని రైతులను ఆదుకుంటున్నామని అన్నారు. చేసిన మంచిని చెప్పుకోవటంలో మంత్రులు, ఎమ్మెల్యేలు ఎందుకు విఫలమవుతున్నారని ప్రశ్నించారు. రైతుల పట్ల ప్రభుత్వానికి ఉన్న చిత్తశుద్ధిని వివరిస్తూనే ప్రత్యామ్నాయ పంటల వైపు రైతును ప్రోత్సహించాలని సూచించారు. డిమాండ్‌కు తగ్గట్లుగా వాణిజ్య పంటలు వేసేలా రైతులను చైతన్య పరచాలని అన్నారు. ధరల స్థిరీకరణ నిధి ద్వారా పొగాకును ఇంత పెద్దమొత్తంలో కొనుగోలు చేయటం దేశ చరిత్రలో ఇదే ప్రథమమని ముఖ్యమంత్రి చంద్రబాబు ఉద్ఘాటించారు. వాణిజ్య పంటలని కొనుగోలు చేసింది కూడా ఏపీనేనని గుర్తుచేశారు. ప్రజలకు ఈ విషయం మాత్రం ఎందుకు చెప్పుకోలేక పోతున్నామని నేతలను అడిగారు. అమరావతిలో వివిధ కార్యక్రమాల నిర్వహణకు ప్రభుత్వ పరంగా కన్వెన్షన్ కేంద్రం ఏర్పాటు చేయాలని సీఎం ఆదేశించారు. రాష్ట్రంలో 6497 మినీ అంగన్‌వాడీ కేంద్రాలను అంగన్‌వాడీ కేంద్రాలుగా అప్‌గ్రేడ్ చేస్తామని అన్నారు. టెంపుల్ టూరిజంతో పాటు ఏపీలో పర్యాటక అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. మచిలీపట్నం బీచ్ ఫెస్టివల్ సక్సెస్‌పై నేతలను సీఎం చంద్రబాబు ప్రశంసించారు. ఈ తరహా కార్యక్రమాలు పెద్దఎత్తున నిర్వహిస్తూ రాష్ట్రంలో పర్యాటకాభివృద్ధికి కృషి చేయాలని సూచించారు ముఖ్యమంత్రి చంద్రబాబు. సీఆర్డీఏ పరిధిలో కొత్తగా తీసుకునే భూముల్లో ప్రభుత్వానికి సంబంధించి... 2019కు ముందు ఆరేళ్ల అనుభవ దారు ఎవరు ఉంటారో వారికే నష్టపరిహారం ఇవ్వాలని సీఎం చంద్రబాబు సూచించారు. బార్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా వాళ్లు రాజధానిలో లా

యూనివర్సిటీ ఏర్పాటు చేయడానికి సంబంధిత భూమి వాళ్లకు లీజ్‌కు ఇవ్వాలని మంత్రి మండలి నిర్ణయం తీసుకుంది. బిల్డింగ్ రూల్స్‌ను మరింత సరళతరం చేయాలని కేబినెట్ నిర్ణయించింది. గుజరాత్‌లో మాదిరిగా బిల్డింగ్ రూల్స్‌ను సరళతరం చేయాలని సీఎం చంద్రబాబు ఆదేశాలు జారీ చేశారు. రాజధాని అమరావతిలో కన్వెన్షన్ సెంటర్ ఏర్పాటుకి వెంటనే ఎ÷-లాన్ చేయాలని ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదేశించారు.

# బనకచర్లతో తెలంగాణకు నష్టం లేదు

**(మొదటి పేజి తరువాయి)**

పోలవరం - బనకచర్ల ప్రాజెక్ట్‌పై మనం దశల వారిగా ముందుకు వెళ్తామని సూచించారు. ఆ తర్వాత కేందప్రభుత్వం ఏం చెబుతుందో దాని ఆధారంగా మనం నిర్ణయం తీసుకుందామని వివరించారు. ఈ ప్రాజెక్ట్‌లు ఎప్పుడూ శంకుస్థాపన చేస్తామనేది త్వరగా నిర్ణయించాలని మంత్రి లోకేష్ అన్నారు. పోలవరం-బనకచర్ల అనుసంధాన ప్రాజెక్ట్‌కి అవసరమైతే కేంద్ర ప్రభుత్వ జోక్యం కూడా అవసరమని సీఎం చంద్రబాబు తెలిపారు. ఈ విషయం అర్థమయ్యేలా చెప్పేందుకు అవసరమైతే కేంద్రం ద్వారా ఓ సమావేశం ఏర్పాటు చేద్దామని చెప్పారు. సున్నితమైన పోలవరం-బనకచర్ల అనుసంధాన ప్రాజెక్ట్‌పై నేతలు పూర్తి అవగాహనతో జాగ్రత్తగా మాట్లాడాలని దిశానిర్దేశర చేశారు. పోలవరం-బనకచర్ల అనుసంధాన ప్రాజెక్టుపై తెలంగాణకు ఉన్న అనుమానాలను నివృత్తి చేయాలని సీఎం చంద్రబాబు మంత్రులు, నేతలకు సూచించారు. ఈ ప్రాజెక్టు ద్వారా వరద జలాలే వాడుకుంటున్నట్లు చెప్పారు. ఈ ప్రాజెక్టు వల్ల తెలంగాణకు ఎలాంటి నష్టమూ లేదని అన్నారు. సచివాలయంలో రాష్ట్రమంత్రివర్గ సమావేశం ముగిసింది. మొత్తం 42 అజెండా అంశాలకు రాష్ట్ర మంత్రివర్గం ఆమోదం తెలిపింది. అనంతరం రాజకీయ అంశాలపై చర్చించారు. ఈ సందర్భంగా చంద్రబాబు మాట్లాడుతూ.. 'తెలంగాణలో అనుమతులు లేకుండా ఎన్నో ప్రాజెక్టులు చేపట్టినా అభ్యంతరం చెప్పలేదు. పోలవరం-బనకచర్ల అనుసంధాన ప్రాజెక్టుపై నేతలంతా మాట్లాడాలి. కేవలం రాజకీయం కోసమే తెలంగాణలో కొందరు అభ్యంతరాలు చెబుతున్నారు. ప్రజలకు వాస్తవాలు వివరించాల్సిన బాధ్యత మంత్రులు, నాయకులపై ఉంది.' అని అన్నారు. అమరావతిలో మలివిడత భూసేకరణపై మంత్రివర్గంలో చర్చ జరిగింది. తొలివిడత నిబంధనలే మలివిడతకూ వర్తింపజేయాలని నిర్ణయించారు. సుపరిపాలనలో తొలిఅడుగు కార్యక్రమాలను ఇన్‌ఛార్జి మంత్రి నేతృత్వంలో జిల్లాస్థాయిలో నిర్వహించాలని కేబినెట్ నిర్ణయించింది. ఆ తర్వాత నియోజకవర్గ స్థాయిలో కార్యక్రమాల నిర్వహణకు ఆమోదం తెలిపారు. ఏడాదిలోగా రెవెన్యూ సమస్యలన్నీ పరిష్కరించాలని సీఎం తేల్చి చెప్పారు. సాంకేతిక సమస్యల సాకుతో దాటవేత ధోరణి సరికాదని, ఇబ్బందులుంటే తనతో మాట్లాడవచ్చన్నారు. రెవెన్యూ సమస్యలపై తరచూ అడుగుతూనే ఉంటానని గట్టిగా చెప్పారు. కూటమి ఏడాది విజయాలు ఇంటింటికీ తీసుకెళ్లే కార్యాచరణ రూపొందించామన్న సీఎం.. జులై 1 నుంచి ఎమ్మెల్యేలు ఆ బాధ్యత తీసుకోవాలన్నారు. జిల్లా స్థాయిలో ఏడాది పాలనపై జిల్లా ఇన్‌చార్జి మంత్రి సమావేశం పెట్టాలని కోరారు. నియోజకవర్గ స్థాయిలో ఎమ్మెల్యేలు ఏడాది పాలనపై సమావేశాలు ఏర్పాటు చేయాలని సూచించారు. ఈ సమావేశాల్లో ప్రభుత్వ పథకాల గురించి ప్రజలకు వివరించాలని చెప్పారు. ఈ నెలాఖరులోపు ఈ సమావేశాలు నిర్వహించాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. జులై 1వ తేదీ నుంచి ఏడాది పాలనపై ఎమ్మెల్యేలు ఇంటింటికీ తిరిగి వివరించాలని నిర్దేశిరచారు సీఎం చంద్రబాబు. కూటమిలోని అన్ని పార్టీల నేతలను కలుపుకొని ముందుకు వెళ్లాలని కోరారు.

-----

# రైతును రాజు చేయడమే మా లక్ష్యం

**(మొదటి పేజి తరువాయి)**

వ్యవసాయాన్ని దండగ అనే స్థాయి నుంచి పండగ చేసేందుకే వైఎస్ఆర్ ఆనాడు ఉచిత విద్యుత్ అందించారని చెప్పారు. రైతుల ఆశీర్వాదం వల్లనే చిన్న వయస్సులో సీఎం అయ్యానని, రైతాంగం అభివృద్ధికి సాయశక్తులా కృషి చేస్తానని చెప్పారు. తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన రైతు భరోసా నిధుల పంపిణీ కార్యక్రమం మంగళవారంతో పూర్తయింది. 9 రోజుల్లో 9 వేలకోట్ల మొత్తాన్ని రైతుల ఖాతాల్లో జమ చేశారు. రైతుభరోసా కార్యక్రమం విజయవంతంగా పూర్తయిన సందర్భంగా సచివాలయం ఎదురుగా రాజీవ్‌గాంధీ విగ్రహం వద్ద 'రైతు నేస్తం'కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా రేవంత్‌రెడ్డి మాట్లాడారు. కేసీఆర్ ఎగ్గొట్టిన రూ. 7 వేల కోట్ల రైతు భరోసా తమ ప్రభుత్వం ఇచ్చిందని అన్నారు. 70 లక్షల మంది రైతుల కళ్ళల్లో సంతోషం చూస్తున్నామని.. రైతుభరోసా కోసం 9 రోజుల్లో రూ. 9 వేల కోట్లు నిధులు రిలీజ్ చేయడం రికార్డ్ అని అన్నారు. 70 లక్షల మంది రైతులకు రైతు భరోసా ఇచ్చామని.. కోటి 49 లక్షల ఎకరాలకు రైతు భరోసా ఇచ్చామని అన్నారు. తెలంగాణ చరిత్ర అంతా రైతులదే అని... భూమి చుట్టూనే మన పోరాటాలు, జీవితాలు ముడిపడ్డాయని అన్నారు. రైతులను ఆదుకున్న చరిత్ర కాంగ్రెస్‌దే అని అన్నారు. మా ప్రజాప్రభుత్వంలో మొదటి ప్రాధాన్యం రైతులే. రైతుల తర్వాత మహిళలు, యువత మా ప్రాధాన్యం. రైతులకు రుణమాఫీ చేస్తామని ఎన్నికల్లో మాట ఇచ్చాం.. నిలబెట్టుకున్నాం అని సిఎం అన్నారు.. 25 లక్షల మందికిపైగా రైతులకు రుణమాఫీ చేశాం. గత ముఖ్యమంత్రి వరి వేసుకుంటే ఉరి వేసుకోవడమే అని చెప్పారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక సన్నవడ్లు పండిస్తే బోనస్ ఇస్తామని చెప్పాం. అంతేకాకుండా 48 గంటల్లో డబ్బు జమ చేశాం. దేశంలోనే అత్యధికంగా వరి పండించే రాష్ట్రమని



గర్వంగా చెప్పుకొంటున్నాం. గత ముఖ్యమంత్రి కేసీఆర్ రూ. 8 లక్షల కోట్లకుపైగా అప్పులు మా నెత్తిన పెట్టి వెళ్లారు. రూ.లక్ష కోట్లతో కాళేశ్వరం కట్టడం.. కూలడం కూడా జరిగిపోయింది. కేసీఆర్, కేటీఆర్, హరీశ్‌రావుకు ఫామ్‌హౌస్‌లు ఎలా వచ్చాయి? రాష్ట్రం దివాలా తీస్తే వాళ్లంతా ఎలా సంపన్నులయ్యారు? కేసీఆర్ వేలాది ప్రభుత్వ పాఠశాలలు మూత వేయించారు. కానీ, కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత 60 వేల ఉద్యోగాలు ఇచ్చాం. గ్రామాల్లో అమ్మ ఆదర్శ పాఠశాలలు తీసుకువచ్చామని అన్నారు. కోటి మంది మహిళలను కోటీశ్వరులను చేయడమే ప్రభుత్వ ధ్యేయం. మహిళలు సౌర విద్యుత్ ఉత్పత్తి చేసేలా చర్యలు చేపట్టాం. వెయ్యి మెగావాట్ల సౌర విద్యుత్‌పై విద్యుత్‌శాఖతో ఒప్పందం కుదుర్చుకున్నాం. మహిళలకు రూ.21వేల కోట్ల వడ్డీలేని రుణాలు ఇచ్చి ఆదుకున్నాం. మహిళా స్వయం సహాయక సంఘాల ఉత్పత్తుల విక్రయానికి చర్యలు చేపట్టాం.

శిల్పారామంలో 150 షాపుల ఏర్పాటుకు స్థలం కేటాయించాం. వెయ్యి బస్సులు కొని ఆర్టీసీకి మహిళలు అ÷-దదెకు ఇచ్చేలా చర్యలు చేపట్టాం. 8 వేల ఐకేపీ కేంద్రాలను మహిళల చేతుల్లో పెట్టాం. పాఠశాలల్లో ఆహార పదార్థాల సరఫరా బాధ్యతను స్వయం సహాయక సంఘాలకు అప్పగించాం. పదేళ్ల భారాస పాలన, 18 నెలల కాంగ్రెస్ పాలనపై చర్చ పెట్టాలి.' అని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. గోదావరి జలాలపై అసెంబ్లీలో చర్చకు కేసీఆర్ సిద్ధమా?అని సీఎం రేవంత్‌రెడ్డి సవాల్ విసిరారు. ' అసెంబ్లీలో చర్చ కోసం స్పీకర్‌కు లేఖ రాయాలి. కేసీఆర్ చెప్పిన తేదీన అసెంబ్లీలో చర్చ చేపట్టే బాధ్యతను మంత్రి శ్రీధర్‌బాబు తీసుకుంటారు. ఆధారాలు, సంతకాలతో అసెంబ్లీలో చర్చకు వస్తా. కేసీఆర్ సిద్ధమా?ఒకరోజు గోదావరి జలాలు, రెండో రోజు కృష్ణా జలాలపై చర్చిద్దాం. గతంలో సంతకాలు చేసిన కాగితాలు అసెంబ్లీ ముందు ఉంచుతా' అని సీఎం అన్నారు.రైతునేస్తం సభలో పాల్గొన్న సీఎం రేవంత్ రెడ్డి కేసీఆర్ ను ఉద్దేశించి ఘాటైన వ్యాఖ్యలు చేశారు. 2016లో బానకచర్లకు పునాది వేసింది కేసీఆరే అని.. రోజమ్మ రొయ్యల పులుసు తిని నీళ్లు అప్పగించింది ఎవరని సీఎం రేవంత్ ప్రశ్నించారు. ఎవరు తెలంగాణకు ద్రోహం చేశారో చర్చిద్దామంటూ సవాల్ విసిరారు. మా పాలన, మీ పాలనపై కేసీఆర్ చర్చకు సిద్ధమా అని ప్రశ్నించారు. కృష్ణానదిపై కేసీఆర్ ఏ ఒక్క ప్రాజెక్టు కూడా పూర్తి చేయలేదని అన్నారు. గోదావరి బనకచర్ల విషయంలో తనపై తప్పుడు ప్రచారం చేస్తున్నారని.. చంద్రబాబుతో ఉండేవాడిని అయితే.. అక్కడే ఉండేవాడినని అన్నారు. బనకచర్లపై అసెంబ్లీలో చర్చకు కేసీఆర్ సిద్ధమా అని ప్రశ్నించారు సీఎం రేవంత్. అసెంబ్లీకి వచ్చి చర్చలో పాల్గొనే దమ్ము కేసీఆర్ కు ఉందా అని అన్నారు. నీటి హక్కుల విషయంలో తెలంగాణకు మరణశాసనం రాసిందే కేసీఆర్ అని మండిపడ్డారు.



# ముగిసిన యుద్ధం

**(మొదటి పేజి తరువాయి)**

పశ్చిమాసియాలో ఇరాన్-ఇజ్రాయెల్ మధ్య యుద్ధం తారాస్థాయికి చేరుకుంది. ఇరాన్ పై అమెరికా నుంచి తీవ్రస్థాయి దాడులు చేసిన వెంటనే మరుసటి రోజు ఇజ్రాయెల్ ఆ దేశంపై ముప్పేట దాడులు చేయడంతో ఇరాన్ విలవిలలాడిపోయింది. ఇజ్రాయెల్ చేసిన ఎదురుదాడులను ఇరాన్ ప్రతిఘటించింది. అత్యంత వ్యూహాత్మకంగా ఇజ్రాయెల్ సోమవారం ఇరాన్ సైన్యం ఇరానియన్ రెవెల్యూషనరీ గార్డు (ఐఆర్‌జి) ప్రధాన కార్యాలయంపై బాంబుల వర్షం కురిపించింది. మరో వైపు ఇరాన్‌లోని అత్యంత కీలకమైన ఎవిన్ ప్రిజన్‌ను కూడా ధ్వంసం చేసింది. ఇరాన్ తాజాగా ఇజ్రాయెల్‌పై ట్రూప్రామిస్ త్రీ పేరిట సైనిక చర్యకు దిగిందని సైనిక వర్గాలు తెలిపాయి. ఇజ్రాయెల్ నగరాలు జెరూసలెం, హఫియా, టెల్ అవీవ్‌పై ఇరాన్ దాడులకు పాల్పడింది. ఈ క్రమంలో ఇరాన్ ,ఇజ్రాయెల్ యుద్ధం

ముగిసిందంటూ అమెరికా అధ్యక్షుడు ట్రంప్ తన సోషల్ మీడియా 'ట్రూత్'లో మంగళవారం పోస్టు చేశారు. 'అందరికీ అభినందనలు. ఇజ్రాయెల్, ఇరాన్‌లు పూర్తి కాల్పుల విరమణకు అంగీకరించాయి. మరో ఆరు గంటల్లో చర్యలు ప్రారంభం కానున్నాయి. 12 గంటల్లో యుద్ధం అధికారికంగా ముగియనుంది. తొలుత ఇరాన్ కాల్పుల విరమణను ప్రారంభించనుంది. అనంతరం ఇజ్రాయెల్ దాన్ని అనుసరించనుంది. దీంతో 12 రోజుల యుద్ధానికి ముగింపు కార్డు పడనుంది. ఒక దేశం కాల్పుల విరమణ పాటించేప్పుడు మరో దేశం శాంతి, గౌరవంతో ఉండాల్సి ఉంటుంది. ప్రతిదీ సరిగ్గా జరుగుతుందనే భావిస్తున్నాను. ఇందు కోసం నేను రెండు దేశాలను అభినందించాలనుకుంటున్నాను. ఈ యద్ధం ఏళ్ల తరబడి కొనసాగి ఉంటే పశ్చిమాసియా నాశనమయ్యేది. కానీ అలా జరగలేదు. ఇక ముందూ అలా జరగదు. ఇజ్రాయెల్, ఇరాన్‌తో సహా మధ్యప్రాచ్యం, ప్రపంచ దేశాలతోపాటు అమెరికాకు దేవుడి దయ ఉంటుంది' అని ట్రంప్ పేర్కొన్నారు.

## సింగయ్య మృతి కేసులో జగన్ కు నోటీసులు

ఇటీవల వైసీపీ అధినేత జగన్ పల్నాడు జిల్లా రెంటపాళ్ల పర్యటన సందర్భంగా సింగయ్య అనే వ్యక్తి మృతి చెందడం తీవ్ర కలకలం రేపింది. జగన్ వాహనం కింద పడి సింగయ్య మృతి చెందినట్టు వీడియోలు వైరల్ అవుతున్నాయి. ఈ వీడియోల ఆధారంగానే పోలీసులు ఈ కేసులో సెక్షన్లు మార్చి వైసీపీ అధినేత జగన్ ను కూడా నిందితుడిగా చేర్చారు. ఈ కేసులో జగన్ ను ఏ2గా పేర్కొన్న పోలీసులు... తాజాగా ఆయనకు నోటీసులు జారీ చేశారు. ఈ మేరకు పోలీసులు నోటీసులతో తాడేపల్లిలోని వైసీపీ ప్రధాన కార్యలయానికి వెళ్లారు. అక్కడ వైసీపీ కార్యాలయ సెక్రటరీ లేళ్ల అప్పిరెడ్డికి నోటీసులు అందించారు. అంతేకాదు, సింగయ్య మృతికి కారణమైనదిగా భావిస్తున్న ఫార్చ్యూనర్ (%ూా 40 ఑ు% 2349) వాహనాన్ని కూడా స్వాధీనం చేసుకున్నారు.

## 'రాహుల్ రహస్య విదేశీ యాత్ర'...

**(మొదటి పేజి తరువాయి)**

కాంగ్రెస్ అగ్రనేత, రాయ్‌బరేలీ ఎంపీ రాహుల్ గాంధీ విదేశీ పర్యటన మరోసారి రాజకీయ దుమారానికి దారితీసింది. ఆయన ప్రస్తుతం లండన్‌లో ఉన్నారని, తన మేనకోడలి గ్రాడ్యుయేషన్ కార్యక్రమానికి హాజరయ్యేందుకు వెళ్లారని కాంగ్రెస్ పార్టీ మంగళవారం వెల్లడించింది. అయితే, రాహుల్ గాంధీ తరచూ విదేశాలకు వెళ్లడంపై, ఆ వివరాలు గోప్యంగా ఉంచడంపై బీజేపీ తీవ్ర విమర్శలు గుప్పించింది. ఈ పరిణామంతో ఇరు పార్టీల మధ్య మాటల యుద్ధం తారస్థాయికి చేరింది.

బీజేపీ ఐటీ విభాగం చీఫ్ అమిత్ మాలవీయ, రాహుల్ గాంధీ విదేశీ పర్యటనల తీరును తప్పుబడుతూ ఎక్స్ వేదికగా పలు ప్రశ్నలు సంధించారు. "రాహుల్ గాంధీ గత వారమే ఓ రహస్య విదేశీ పర్యటన ముగించుకువచ్చారు. ఇప్పుడు మళ్లీ మరో అజ్ఞాత ప్రదేశానికి విదేశాలకు వెళ్లారు" అని మాలవీయ తన పోస్ట్‌లో ఆరోపించారు. "ఈ తరచూ అదృశ్యమవ్వడాలు ఎందుకు? దేశానికి దూరంగా ఆయనను అంతగా ఆకర్షిస్తున్న విషయం ఏమిటి? లోక్‌సభలో ప్రతిపక్ష నేతగా, భారత ప్రజలకు ఆయన ఈ విషయాలపై సమాధానం చెప్పి తీరాలి" అని అమిత్ మాలవీయ డిమాండ్ చేశారు.

## జగన్ కారణంగానే సింగయ్య మృతి

నెల్లూరు, **జూన్ 24 ఆంధ్ర ప్రగతి**

మాజీ సీఎం జగన్ పర్యటనలో సింగయ్య మృతి చెందడం దారుణమని, దీనికి జగన్ బాధయత వహించాలని పిసిసి చీఫ్ వైఎస్ షర్మిల అన్నారు.. జగన్ సైడ్ బోర్డు మీద నిలబడి ప్రయాణం చేయడమే తప్పని... జగన్ షేక్ హ్యాండ్ ఇస్తున్న సమయంలోనే సంఘటన జరిగిందన్నారు. ఫేక్ వీడియో అనడం దురదృష్టకరమన్నారు. జిల్లాలో వైఎస్ షర్మిలా రెడ్డి పర్యటించారు. ఈ సందర్భంగా ఆకుతోట గిరిజనకాలనీ నుంచి ఇందిరా భవన్ వరకు ర్యాలీగా వెళ్లారు. గాంధీబొమ్మ సెంటర్ వద్ద వైఎస్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు షర్మిల. అనంతరం మీడియాతో మాట్లాడుతూ.. జిల్లాలో కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి విస్తృతస్థాయి సమావేశం ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ఏపీలో కాంగ్రెస్ పార్టీ బలోపేతం కావడం అందరికీ అవసరమన్నారు. జగన్ ప్రతీ విషయంలోనూ ప్రజలను మోసం చేశారని మండిపడ్డారు.

## రామతారక మంత్రం సర్వజీవులకు
# సద్గతులను ప్రసాదిస్తుంది

### -డాక్టర్ మల్లు వేంకటరెడ్డి, తితిదే



**ఆంధ్ర ప్రగతి మిడుతూరు జూన్ 24:** రామతారక మంత్రం సర్వజీవులకు సకల పాపముల నుండి ఉపశమనంతో పాటు, ఉత్తమ గతులను ప్రాప్తింప చేస్తుందని తిరుమల తిరుపతి దేవస్థానములు హిందూ ధర్మ ప్రచార పరిషత్తు ఉమ్మడి కర్నూలు జిల్లా శాఖ కార్యనిర్వాహకులు డాక్టర్ మల్లు వేంకటరెడ్డి అన్నారు. తిరుమల తిరుపతి దేవస్థానములు హిందూ ధర్మ ప్రచార పరిషత్తు ఉమ్మడి కర్నూలు జిల్లా శాఖ ఆధ్వర్యంలో మండల కేంద్రమైన మిడుతూరులోని శ్రీకృష్ణ మందిరం నందు నాలుగు రోజుల కార్యక్రమాన్ని ప్రారంభిస్తూ వారు ప్రారంభోపన్యాసం చేశారు. అనంతరం డోన్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు రాష్ట్ర ప్రభుత్వ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత ప్రముఖ ధార్మిక ప్రవచకులు డాక్టర్ తొగట సురేశ్ బాబు మాట్లాడుతూ శ్రీమద్రామాయణము లోని వివిధ పాత్రలు సమాజానికి ఎలా అన్వయం చేసుకోవాలో అందులోని ఆదర్శాలను, లోక నీతిని దృష్టాంతాలతో వివరించారు. ఈ కార్యక్రమంలో ధర్మప్రచారకులు చెంచు రామ్మోహన్ రావు, భజన మండలి అధ్యక్షులు బన్నూరు రామకృష్ణారెడ్డి, దాలు చిట్టిబాబు, భజన నారాయణ, కె. మదనమోహనాచారి, అర్చకులు అన్నమరాజు వెంకట్రామయ్య, మధు, సంపంగి వెంకటేశ్వర్లు, ఆర్.కిరణ్, జనార్దన్ యాదవ్, జె. వెంకటేశ్వర్లు, జయరాములు యాదవ్, శివ, నాగ సుబ్బుడు, భజన మండలి సభ్యులు పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

## రైతుల పండించిన పొగాకు మద్దతు ధర ప్రకటించాలి.



**ఆంధ్ర ప్రగతి నంద్యాల జూన్ 24:** పొగాకు రైతుల సమస్యలు పరిష్కరించాలని, రైతుల పండించిన పొగాకును ప్రభుత్వం కొనుగోలు చేయాలని, పొగాకు రైతులను మోసం చేసిన పొగాకు కంపెనీలపై చర్యలు తీసుకోవాలని నంద్యాల జిల్లాలోని వివిధ గ్రామాలకు చెందిన పొగాకు రైతులు ఏపీ రైతు సంఘం ఆధ్వర్యంలో కలెక్టర్ కార్యాలయం ముందు ఆందోళన చేపట్టారు.. కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా అధ్యక్ష కార్యదర్శులు టి రమేష్ కుమార్ ఏ రాజశేఖర్ జిల్లా సహాయ కార్యదర్శి టి రామచంద్రుడు, సిపిఎం నాయకులు లక్ష్మణ్ నరసింహ తదితరులు పాల్గొన్నారు.

# విద్య పట్ల ఆసక్తి ఉన్న వారికి
# ఓపెన్ స్కూల్ చక్కని సువర్ణ అవకాశం.

**-పది మరియు ఇంటర్మీడియట్ కోర్సులకు జూలై 30వ తేది వరకు ఆన్లైన్ దరఖాస్తుకు అవకాశం.**

**-ఆలస్య రుసుముతో ఆగస్టు 1 నుండి 15 వరకు దరఖాస్తు చేయవచ్చు. -జిల్లా రెవెన్యూ అధికారి డి.రాము నాయక్.**

**ఆంధ్ర ప్రగతి నంద్యాల, జూన్, 24:** విద్య పట్ల ఆసక్తి ఉన్న విద్యార్థులు, ఉద్యోగులు, గృహిణులు ఓపెన్ స్కూల్ సువర్ణ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని విద్యావంతులు కావాలని జిల్లా రెవెన్యూ అధికారి డి.రామునాయక్ పేర్కొన్నారు.
మంగళవారం కలెక్టరేట్ లోని వీడియో కాన్ఫరెన్స్ హాలులో పదవ తరగతి, ఇంటర్మీడియట్ ఓపెన్ స్కూల్ ప్రవేశాలపై సంబంధిత అధికారులతో జిల్లా రెవెన్యూ అధికారి సమావేశం నిర్వహించారు.
ఈ సందర్భంగా జిల్లా రెవెన్యూ అధికారి మాట్లాడుతూ... ఆంధ్రప్రదేశ్ సార్వత్రిక విద్యాపీఠం దూర విద్యా విధానంలో 10 మరియు ఇంటర్మీడియట్ కోర్సులను విజయవంతంగా నిర్వహిస్తోందన్నారు. ఈ విద్యాపీఠం జారీ చేసే సర్టిఫికెట్లు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల గుర్తింపు పొందియుండి, ఉన్నత చదువులకు మరియు ఉద్యోగాలు పొందుటకు అర్హత కలిగి ఉంటుందన్నారు. పది మరియు ఇంటర్మీడియట్ దూరవిద్య నిమిత్తం ఈనెల 12 నుంచి ఆన్లైన్ ద్వారా దరఖాస్తులు స్వీకరిస్తున్నారని... జూలై 30 చివరి తేదీలోగా **https://apopenschool.ap.gov.in** సైట్ ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చు అన్నారు. ఆలస్య రుసుము రూ.200/-లతో ఆగస్టు 1 నుండి 15వ తేది వరకు కూడా ఆన్లైన్ లో దరఖాస్తులు సమర్పించవచ్చునన్నారు. పదవ తరగతిలో నమోదు చేసుకోవడానికి ఎటువంటి విద్యార్హత అవసరం లేదని 14సం.లు పైబడి చదవడం, వ్రాయడం వస్తే



సరిపోతుందన్నారు. ఇంటర్మీడియట్ కు మాత్రం పదవ తరగతి పాస్లేదా ఫెయిల్ అయిన వారు అర్హులన్నారు. ఇంటర్మీడియట్ రెండు సంవత్సరాలకు కలిపి ఒకే సారి పరీక్షలు నిర్వహించే అవకాశం ఉంటుందన్నారు. ఇందుకు జిల్లాలోని వివిధ మండలాల్లో 25 సెంటర్లు ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ఈ పరీక్షలో ఉత్తీర్ణత సాధించిన వారు అన్ని పోటీ పరీక్షలు వ్రాయడానికి అర్హులని తెలిపారు. రెగ్యులర్ విధానంలో పాఠశాల, కళాశాలకు వెళ్లడానికి ఇబ్బంది పడేవారు సెలవు రోజుల్లో, ఆదివారాల తరగతులు నిర్వహించడం జరుగుతోందన్నారు. విద్యార్థుల సౌలభ్యం కోసం ఇంగ్లీష్, తెలుగు, ఉర్దూ మాధ్యమాల్లో పరీక్షలు వ్రాసే అవకాశం ఉందన్నారు. ఎస్సీ, ఎస్టీ, బిసిలు, మైనార్టీ, దివ్యాంగులు, మాజీ సైనికోద్యోగులు రాయితీ పొందే అవకాశం ఉందన్నారు. చదువు మధ్యలో ఆపేసిన వారికి ఇదొక సువర్ణ అవకాశం అని ఈ అవకాశాన్ని పూర్తి స్థాయిలో వినియోగించుకోవాలన్నారు. పోలీసు శాఖ, ఎంపిడిఓలు, పంచాయతీ కార్యదర్శులు,




తహశీల్దార్లు, విఆర్ఓలు, మెప్మా, డిఆర్డిఎ, ఐసిడిఎస్, డ్వామా, వైద్య శాఖలు క్రింద స్థాయి సిబ్బందితో పాటు విద్య పట్ల ఉత్సుకత ఉన్న వారికి అవగాహన కల్పించాలన్నారు. వయోజన విద్యా శాఖ వాలంటీర్ల ద్వారా అవసరమైన సహాయ సహకారాలు అందించాలన్నారు. జిల్లాలోని అన్ని ప్రధాన కూడళ్ల వద్ద ఓపెన్ స్కూల్ కు సంబంధించి బ్యానర్స్, పోస్టర్లను ఏర్పాటు చేయాలని మున్సిపల్ అధికారులకు డిఆర్ఓ సూచించారు. అదే విధంగా అన్ని అసంఘటిత రంగ కార్మికులు మరియు వారి కుటుంబాలతో కలిసి నమోదును ప్రోత్సహించాలని కార్మిక శాఖ అధికారిని, పాఠశాలలో డ్రాపౌట్లను గుర్తించి, వారిని ఓపెన్ స్కూల్ అడ్మిషన్ల వైపు ప్రోత్సహించేలా పాఠశాల యాజమాన్యం, క్లస్టర్ రిసోర్స్ పర్సన్లతో అదనపు ప్రాజెక్ట్ కోఆర్డినేటర్, సమగ్ర శిక్ష అధికారులు సమన్వయం చేసుకోవాలని డిఆర్వో పేర్కొన్నారు.ఈ సమావేశంలో డిఈఓ జనార్ధన్ రెడ్డి, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## ఎన్నికల ప్రక్రియలో రాజకీయ పార్టీల అభిప్రాయాలు, సూచనలు కీలకం.

**-తప్పులు లేని ఓటర్ల జాబితా తయారీకి సహకరించండి.-జిల్లా రెవెన్యూ అధికారి డి.రాము నాయక్.**

**ఆంధ్ర ప్రగతి నంద్యాల, జూన్, 24:** జిల్లాలో ఎన్నికల ప్రక్రియను పటిష్టం చేయడంలో రాజకీయ పార్టీల అభిప్రాయాలు, సూచనలు కీలకమని జిల్లా రెవెన్యూ అధికారి డి.రాము నాయక్ పేర్కొన్నారు. మంగళవారం జిల్లా రెవెన్యూ అధికారి ఛాంబర్ లో గుర్తింపు పొందిన రాజకీయ పార్టీ ప్రతినిధులతో డిఆర్ఓ సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా జిల్లా రెవెన్యూ అధికారి మాట్లాడుతూ... తప్పులు లేని ఓటర్ల జాబితాను రూపొందించేందుకు రాజకీయ పార్టీల ప్రతినిధులు సహాయ సహకారాలు అందజేయాలన్నారు. ఓటర్ల జాబితాలోని మృతులు, మార్పులు, చేర్పులను బూతు స్థాయి ఏజెంట్లతో పరిశీలించుకుని అభ్యంతరాలు ఉంటే సంబంధిత ఈఆర్ఓ, ఏఆర్ఓలకు తెలియజేయాలన్నారు.



ఈ సందర్భంగా వివిధ అంశాలకు సంబంధించి సమావేశంలో చర్చించారు.అనంతరం సమావేశంలో వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు మాట్లాడుతూ... గత సార్వత్రిక ఎన్నికల్లో అమలు చేసిన హోమ్ ఓటింగ్ శాతాన్ని ఇంకా పెద్ద ఎత్తున అమలు అయ్యేలా చర్యలు చేపట్టాలన్నారు. అదే విధంగా ప్రభుత్వ ఉద్యోగులకు ఇచ్చే పోస్టల్ బ్యాలెట్ లో గెజిటెడ్ అధికారి సంతకం, జిల్లాలో గిరిజనలు, చెంచు జనాభా ఎక్కువగా ప్రాంతాల్లో వారికి ఓటింగ్ పై చైతన్యం కల్పించడం, మృతులు, డూప్లికేట్ ఓటర్లు ఉండకుండా చర్యలు తీసుకోవాలని కోరారు. రాజకీయ పార్టీ ప్రతినిధులు సూచించిన అంశాలను ఎన్నికల సంఘానికి నివేదిస్తామని డిఆర్ఓ పేర్కొన్నారు. ఈ సమావేశంలో ఎన్నిక విభాగ సూపరింటెండెంట్ జయ ప్రసాద్, ఇంచార్జి ఎఓ సుభాకర్, బీఎస్పీ పార్టీ ప్రతినిధి కొట్టం శ్రీనివాసులు, కాంగ్రెస్ పార్టీ ప్రతినిధి సయ్యద్ రియాజ్ బాషా, టిడిపి పార్టీ ప్రతినిధి కె.శివరాం రెడ్డి, వైఎస్ఆర్సిపి పార్టీ ప్రతినిధి సాయిరాం రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## ఇటీవల మృతి చెందిన బాధిత కుటుంబ సభ్యులకు
## అండగా ఉంటామని భరోసానిచ్చిన మాజీ ఎమ్మెల్యే శిల్పా రవిరెడ్డి.

**ఆంధ్ర ప్రగతి నంద్యాల రూరల్ జూన్ 24:** నంద్యాల నియోజకవర్గంలో ఇటీవల మృతి చెందిన బాధిత కుటుంబ సభ్యులను మంగళవారం మాజీ ఎమ్మెల్యే శిల్పా రవిచంద్రకిషోర్ రెడ్డి పరామర్శించి, వారికి ఎల్లవేళలా అండగా ఉంటామని భరోసా కల్పించారు. నంద్యాల జిల్లా గుంతనాల గ్రామానికి చెందిన బొప్ప నాగేంద్ర పుల్లమ్మ దంపతుల కుమార్తె గోస్పాడు మండలం తేళ్లపురి గ్రామ సచివాలయ సెక్రటరీ అయిన బొప్ప సుజాత బ్రెయిన్ డెడ్ అయినది. ఆమె ఈ లోకాన్ని విడిచిపోతూ మరో ఎనిమిది మందికి తన అవయవాలను దానం చేసి జీవం పోసింది. ఈ మేరకు గుంతనాల గ్రామంలో మృతురాలి తల్లిదండ్రులను మాజీ ఎమ్మెల్యే శిల్పా



రవిచంద్రకిషోర్రెడ్డి కలిపి పరామర్శించి వారి కుటుంబానికి ఎల్లవేళలా అండగా ఉంటామని హామీ ఇచ్చారు. అదే విధంగా నంద్యాల పట్టణం 21వ వార్డులో ఇటీవల మృతి చెందిన వైఎస్సార్సీపీ కార్యకర్త



సుబ్బరాయుడు కుటుంబ సభ్యులను కలిసి పరామర్శించారు. వీరి వెంట వైసీపీ నాయకులు రాజారెడ్డి, జనార్ధన్ రెడ్డి, వేణు, సుబ్బరాయుడు, అనీల్ అమృతరాజ్, తదితరులు ఉన్నారు.

## వికలాంగుల, వృద్ధుల ప్రత్యేక శిబిరాలు సద్వినియోగం చేసుకోండి

### -సెంట్రల్ ఫుడ్ కార్పొరేషన్ డైరెక్టర్ నరహరి విశ్వనాథ్ రెడ్డి.

**ఆంధ్ర ప్రగతి నంద్యాల జూన్ 24:** దివ్యాంగులు, వృద్ధులకు అవసరమైన సహాయాలు, ఉపకరణాలు, సాయపరికరాలు ఉచితంగా అందించేందుకు నంద్యాల జిల్లాలోని 7 అసెంబ్లీ నియోజకవర్గాలలో నంద్యాల ఎంపీ డాక్టర్ బైరెడ్డి శబరి చొరవతో ప్రత్యేక శిబిరాలు నిర్వహించనున్నట్లు సెంట్రల్ ఫుడ్ కార్పొరేషన్ డైరెక్టర్ నరహరి విశ్వనాథ్ రెడ్డి మంగళవారం తెలిపారు. ఈ శిబిరాలు నంద్యాల పార్లమెంట్ సభ్యురాలు, లోక్ సభ టీడీపీ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ డాక్టర్ బైరెడ్డి శబరి చొరవతో కేంద్ర ప్రభుత్వానికి



చెందిన ఏ డి ఐ పి పథకం కింద, ఆర్టిఫిషియల్ లింబ్స్ మానుఫాక్చరింగ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా సహకారంతో ఏర్పాటు చేస్తున్నట్లు ఆయన తెలిపారు. ఈనెల 26వ తేదీ నంద్యాల మున్సిపల్ టౌన్ హాలులో, 28వ తేదీ నందికొట్కూరు మండల పరిషత్ కార్యాలయంలో, జూలై 1వ తేదీ ఆళ్లగడ్డ మండల పరిషత్ కార్యాలయంలో,జూలై 4వ తేదీ ఆత్మకూరు మండల పరిషత్ కార్యాలయంలో, జూలై 8వ తేదీ బనగానపల్లి మండల పరిషత్ కార్యాలయంలో, జూలై 11వ తేదీ డోన్ మండల పరిషత్ కార్యాలయంలో, జూలై 15వ తేదీ పాణ్యం మండల పరిషత్ కార్యాలయంలో ప్రత్యేక శిబిరాలు నిర్వహిస్తున్నట్లు వివరించారు. ఈ శిబిరాలు ఉదయం 9:00 గంటల నుంచి సాయంత్రం 5:00 గంటల వరకు నిర్వహించబడతాయని అర్హత గల దివ్యాంగులు, వృద్ధులు ఎంపీ డాక్టర్ బైరెడ్డి శబరి ఆధ్వర్యంలో జరిగే ఈ ప్రత్యేక శిభిరాలను సద్వినియోగం చేసుకోవాలని నరహరి విశ్వనాథ్ రెడ్డి కోరారు.

# వర్షా కాలం లో వచ్చే వ్యాధుల పట్ల
# ప్రజలు అప్రమత్తంగా ఉండాలి.

### -సామాజిక కార్యకర్త డోన్ పి.మహమ్మద్ రఫి.

**ఆంధ్ర ప్రగతి డోన్ జూన్ 24:** వర్షాకాలంలో చిన్న చిన్న జాగ్రత్తలతో ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చును. వర్షాకాలంలో ముఖ్యంగా దోమల బెడద ఎక్కువ. దోమ కాటు వల్ల విషజ్వరాలు వస్తాయి కావున దోమల కాటు నుండి కాపాడుకోవాలని సామాజిక కార్యకర్త పి. మహమ్మద్ రఫి పేర్కొన్నారు.
విపరీతమైన ఎండల తర్వాత వచ్చే వర్షాకాలం శరీరానికీ, మనసుకీ ఎంతో హాయిగా ఉంటుంది. అయితే వర్షాకాలం, శీతాకాలం, ఎండాకాలం ఇలా సీజన్ ఏదైనా ప్రజల్ని పలు రకాల వ్యాధులు చుట్టుముడుతూనే ఉంటాయి. సహజంగానే సీజన్ మారినప్పుడల్లా సీజనల్ వ్యాధుల పట్ల తగిన జాగ్రత్తలు తీసుకోవాలి. జలుబు,దగ్గు,తుమ్ములు, వాంతులు, నీళ్ల విరేచనాలు, టైఫాయిడ్, మలేరియా, డెంగ్యు, మెదడువాపు లాంటి వ్యాధులు సంభవిస్తాయి. కావున తగిన జాగ్రత్తలు తీసుకోవాలి. ఒకవేళ అనారోగ్యానికి గురైతే వెంటనే వైద్య నిపుణులను సంప్రదించి తగు చికిత్సను పొంది ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని సామాజిక కార్యకర్త డోన్ పి.మహమ్మద్ రఫి తెలిపారు.
కొన్ని జాగ్రత్తలు ఆహారం తీసుకునే ముందు, మల విసర్జన చేసిన తర్వాత చేతులను సబ్బుతో శుభ్రంగా కడుక్కోవాలి. వేడి ఆహార పదార్థాలను మాత్రమే తినాలి. ఇంటి చుట్టూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి. క్లోరినేషన్ చేసిన నీటినే తీసుకోవాలి. కాచి వడబోసిన నీటినే తాగాలి. డయేరియా వ్యాధి బారిన పడిన వారికి రోజుకు వీలైనంత ఎక్కువగా నీళ్లు తాగించాలి. శుభ్రమైన చోట మాత్రమే మంచినీటిని పెట్టాలి. అలాగే నీటిపై మూత పెట్టడం మరవొద్దు. మంచినీరు ఉంచిన చోట స్నానం చేయడం, బట్టలు ఉతకడం చేయొద్దు. కాయగూరలు, పండ్లను శుభ్రంగా కడగాలి. సాధ్యమైనంత వరకు అప్పుడే వండిన ఆహారాన్ని తీసుకోవాలి. రాత్రి పూట నిల్వ ఉంచిన ఆహార పదార్థాలు, ముఖ్యంగా



పి. మహమ్మద్ రఫి,సామాజిక కార్యకర్త ,డోన్

మాంసాన్ని తినొద్దు. భోజనం చేసే సమయంలో చేతులను సబ్బుతో కడుక్కోవాలి. అలాగే అలర్జీ కలిగించే లెదర్ వస్తువులకు దూరంగా ఉండండి. వర్షాకాలంలో ట్రాన్స్ ఫార్మర్లకు దూరంగా ఉండాలి. విద్యుత్ వైర్లను గమనించి తగు జాగ్రత్తలతో ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని సామాజిక కార్యకర్త డోన్ పి. మహమ్మద్ రఫి తెలిపారు.

## వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో పొలం పిలుస్తోంది కార్యక్రమం.

**ఆంధ్ర ప్రగతి నంద్యాల రూరల్ జూన్ 24:** కొత్తపల్లి మరియు బిల్లలాపురం గ్రామాల యందు మండల వ్యవసాయ అధికారి నంద్యాల వారు ప్రసాద్ రావు ఆధ్వర్యంలో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా మండల వ్యవసాయ అధికారి నంద్యాల వారు మాట్లాడుతూ రైతులు వరి సాగుకు ముందు పచ్చిరొట్ట ఎరువులైన జీలుగ లేదా



పిల్లి పెసర లేదా మినుము సాగు చేయాలని దీనివలన భూమిలో కర్బన శాతం పెరిగి నేల సారవంతం అవుతుందని తెలిపారు. అలాగే వరిగట్లపై కంది లేదా కూరగాయలు సాగు చేయుట వలన రైతులు అదనపు ఆదాయం పొందగలరని, ఎరువులు పురుగుమందుల వాడకం తగ్గించి ప్రకృతి వ్యవసాయ పద్ధతులు పాటించి నాణ్యమైన దిగుబడులు పొందగలరని తెలిపారు. అదేవిధంగా ప్రతి రైతు తప్పనిసరిగా భూసార పరీక్షలు చేయించుకుని దానికి అనుగుణంగా ఎరువులు వాడడం వలన సాగు ఖర్చులు తగ్గించగలరని అలాగే పురుగుమందులు విచక్షణారహితంగా వాడకుండా సమగ్ర సస్యరక్షణ చర్యలు చేపట్టాలని తెలిపారు. రైతులు సాలు వరి సాగు చేయటం వలన సేద్యం ఖర్చులు తగ్గించగలరని ,అలాగే వరిలో ఎండి ఎల్ఆర్ 7, ఆర్ ఎన్ ఆర్ 15048 రకాలు ఖరీఫ్ సాగుకు అనువైనవి అని తెలిపారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణ అధికారి మహేశ్ గ్రామ వ్యవసాయ సహాయకులు చక్రధర్, అనూష, శివనాయక్ మరియు రైతులు పాల్గొన్నారు

ప్రతి అక్షరం ప్రజాహితం
ఆంధ్రప్రగతి
తెలుగు దినపత్రిక






# ట్రాలీ ఆటో నూతన కమిటీ ఎన్నిక.



**ఆంధ్ర ప్రగతి నంద్యాల జూన్ 24:** భారత కమ్యూనిస్టు పార్టీ సిపిఐ పట్టణ సమితి ఆధ్వర్యంలో నిర్వహించే నంద్యాల పట్టణ సిపిఐ శాఖ సమావేశాలలో భాగంగా మంగళవారం నాడు ట్రాలీ ఆటో సిపిఐ శాఖ సమావేశం వెంకట కృష్ణ అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశమునకు సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి ఎస్ బాబా ఫక్రుద్దీన్ సిపిఐ పట్టణ కార్యదర్శి కె ప్రసాద్ సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు జి నాగరాముడు రైతు సంఘం జిల్లా కార్యదర్శి జి సోమన్న ఏఐటీయూసీ పట్టణ అధ్యక్ష కార్యదర్శులు భూమని శ్రీనివాసులు డి శ్రీనివాసులు మహిళా సమాఖ్య పట్టణ కన్వీనర్ సుశీలమ్మ హాజరు కావడం జరిగింది. శాఖ సభ్యులతో ఎన్టీఆర్ కాంప్లెక్స్ చుట్టూ ర్యాలీ నిర్వహించి సీనియర్ కామ్రేడ్ అనంతయ్య పతావిష్కరణ గావించడం జరిగింది. అనంతరం నిర్వహించిన సమావేశంలో 9 మంది సభ్యులతో నూతన కమిటీని ఎన్నుకోవడం జరిగింది. శాఖ కార్యదర్శిగా రమణారెడ్డి సహాయ కార్యదర్శులుగా షఫీ. రమేష్ లను ఎన్నుకోవడం జరిగింది.

# సతీష్ కుమార్ అక్రమ సస్పెన్షన్ ఉద్యోగం తొలగింపు పై జాయింట్ కలెక్టర్ విచారణ.




**ఆంధ్ర ప్రగతి నంద్యాల జూన్ 24:**
నంద్యాల జిల్లా, కోవెలకుంట్ల మండలం, రేవనూరు గ్రామం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో హిందీ టీచర్ గా పనిచేయుచున్న కె. సతీష్ కుమార్ కుమార్ పై తప్పులు చేసి పనిష్మెంట్లు పొందిన టీచర్లు కలిసి టీచర్స్ జెఏసి, నంద్యాల పేరుతో ఒక అడ్రస్ లేని ఫిర్యాదును చేయడం జరిగిందని తెలిపారు. టీచర్స్ జే.ఏ.సి చేసిన తప్పుడు పిర్యాదును అప్పటి ఆర్జేడీ వెంకట కృష్ణారెడ్డి స్వీకరించి నిబంధనలకు విరుద్ధగా విచారణకు ఆదేశించారని తెలిపారు. కర్నూలు విద్యాశాఖ అధికారులు ఎలాంటి విచారణ చేయకుండానే, సంజాయిషీ కోరకుండా, వారికి వారే తప్పుడు రిపోర్టు వ్రాసుకొని, సమాచార హక్కు చట్టం 2005ను దుర్వినియోగం చేస్తున్నారని అక్రమంగా అప్పటి డిఇఓ రంగారెడ్డి సస్పెండ్ చేయడం జరిగిందని తెలిపారు. తదుపరి ఎలాంటి విచారణ చేయకుండానే, అప్పటి నంద్యాల ఉప విద్యాశాఖాధికారి మహమ్మద్ బేగ్ మరియు టీచర్స్ జే.ఏ.సి కలిసి తప్పుడు రిపోర్టు వ్రాయించుకొని అప్పటి డిఇఓ శామ్యూల్ ఉద్యోగం నుంచి తొలగించారని తెలిపారు.తప్పుడు మార్గాల్లో తనను సస్పెండ్ చేశారని, తదుపరి ఉద్యోగం నుండి తొలగించారని ఆంధ్ర ప్రదేశ్ షెడ్యూల్ క్యాస్ట్ కమిషన్ లో ఫిర్యాదు చేయగా, స్పందించిన ఎస్.సి కమిషన్ పూర్తి అంశంలో విచారణ చేసి నివేదిక సమర్పించాలని నంద్యాల జాయింట్ కలెక్టర్ విష్ణు చరణ్ గారిని ఆదేశించినట్లు తెలిపారు. అందులో భాగంగా కడప ఆర్జేడీ, కర్నూలు డిఈఓ, నంద్యాల డీఈఓ మరియు నంద్యాల డిప్యూటీ ఈఓ ఈ నెల 25.06.2025న జరుగబోయే విచారణకు అన్ని రికార్డులు తీసుకొని హాజరుకావాలని జాయింట్ కలెక్టర్ విష్ణు చరణ్ ఆదేశాలు జారీ చేశారని తెలిపారు.

# నకిలీ నంది బ్రాండ్ పైపులు, వాటర్ ట్యాంకుల తయారీదారులపై కేసు నమోదు.

**ఆంధ్ర ప్రగతి నంద్యాల జూన్ 24:** నంది గ్రూప్ సంస్థలు గత 45 సంవత్సరాలుగా “నంది” బ్రాండ్ పేరుతో నాణ్యమైన, ఉన్నతమైన నీటి పైపులు, వాటర్ ట్యాంకులు మరియు నంది గ్రూప్ సంస్థల ఇతర ఉత్పత్తులు విజయవంతంగా ఉత్పత్తి చేస్తూ, దక్షిణాది రాష్ట్రల మార్కెట్లో వినియోగదారుల మద్దతును పొందుతున్నారు. మా కంపెనీ యొక్క నంది పేరు మరియు నంది బొమ్మ ట్రేడ్ మార్క్ యాక్ట్ 1999 ప్రకారము మరియు కాపీరైట్ యాక్ట్, న్యూ ఢిల్లీ, రిజిస్టర్ ఆఫీస్ నందు నమోదు చేయబడినవి.అయితే ఇటీవల, కొంతమంది అక్రమ వ్యాపారులు అదే నంది పేరు మరియు నంది బొమ్మ వాడుతూ, నకిలీ పైపులు, వాటర్ ట్యాంకులు మరియు నంది గ్రూప్ సంస్థల ఇతర ఉత్పత్తులు తక్కువ నాణ్యతతో తయారు చేసి, నంది పేరుకి ముందుగా లేక నంది పేరు తరువాత గాని ఎదో ఒక పదం జతచేసి మార్కెట్లో విక్రయిస్తున్నారని సమాచారం లభించింది. వీటిని రంగారెడ్డి జిల్లా కాచిగూడా వద్ద ఉన్న పారిశ్రామిక ప్రాంతాల్లో ప్లాట్ నెం.130, 131 నందు మాన్సి ప్లాస్టిక్స్ కంపెనీ వారు నంది ప్లస్ అను పేరుపెట్టి వాటర్ ట్యాంకులు ఉత్పత్తి చేస్తున్నట్లు సమాచారం తెలిసింది. ఈ నకిలీ నంది ప్లస్ వాటర్ ట్యాంకులను కలకత్తా ట్యూబ్ కార్పొరేషన్, షాప్ నెంబర్ 20%ఊ%21, లాల కమర్షియల్ కాంప్లెక్స్, రాణిగంజ్, హైదరాబాద్ హోల్ సేల్ వ్యాపురాలైన ఆశిష్ అగర్వాల్ మరియు సంజయ్ మెహ్రా అనువారు విక్రయాలు కొనసాగిస్తున్నారు. ఈ విషయం తెలిసిన వెంటనే దీనిపై నంది గ్రూప్ వారు 21.06.2025 తేదీన గాంధీ నగర్, హైదరాబాద్ పోలీసు వారికి ఫిర్యాదు చేయగా సెక్షన్లు 318 (4) ఆర్/డబ్ల్యూ 3 (5) బిఎన్ఎస్, 63 సిఏ కింద కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు.ఈ సందర్భంగా, నంది గ్రూప్ సంస్థల డైరెక్టర్ సుజల మాట్లాడుతూ, ఈ నకిలీ ఉత్పత్తుల వలన అసలైన మా యొక్క నంది బ్రాండ్ విశ్వసనీయతకు నష్టం జరుగుతుందని. దీని వలన మా కంపెనీ పేరు ప్రఖ్యాతలు కోల్పోవడము మరియు మావ్యాపారానికి నష్టము కలగడమే కాకుండా, వినియోగదారులు నకిలీ ఉత్పత్తులు కొని మోసపోతున్నారు. అందువలన నకిలీ నంది పైపులు, వాటర్ ట్యాంకులు మరియు నంది గ్రూప్ సంస్థల నకిలీ ఉత్పత్తులు తయారుచేసిన వారిపై కఠినమైన మరియు న్యాయబద్ధమైన చర్యలు తీసుకుంటామని, మా వినియోగదారుల విశ్వాసాన్ని కాపాడేందుకు ఇది తప్పనిసరిగా చర్యగా చేయుచున్నాము. నకిలీ ఉత్పత్తులపై మా కంపెనీకి ఎవరైనా సమాచారం ఇచ్చిన వారికి, ప్రోత్సాహంగా తగిన పారితోషికం ఇవ్వబడును అని తెలియజేసినారు.ఇకపై నంది గ్రూప్ కంపెనీ వారి లీగల్ టీమ్ మరియు స్థానిక పోలీసు వారి సహాయంతో కలిసి ట్రేడ్ మార్క్ యాక్ట్ మరియు కాపీ రైట్ యాక్ట్ కలిగివున్న మా నంది పేరు మరియు నంది బొమ్మ వాడుతున్న నకిలీ తయారీ కేంద్రాలపై దాడులు నిర్వహించి నకిలీ ఉత్పత్తులు తయారుచేసి మా కంపెనీ యొక్క పేరు ప్రఖ్యాతలకు భంగం కలిగించి, మా వ్యాపారానికి నష్టం కలుగజేసిన బాధ్యులపై చట్ట పరంగా కఠినమైన మరియు న్యాయబద్ధమైన చర్యలు తీసుకొంటామనీ తెలియజేశారు.

# మర్రి స్వామి పి.డి.ఎస్.యు విద్యార్థి సంఘంలో చేరిక.

## -పి.డి.ఎస్.యు రాష్ట్ర అధ్యక్షులు రఫీ.




**ఆంధ్ర ప్రగతి నందికొట్కూరు జూన్ 24:**
నందికొట్కూరు డివిజన్ పరిధిలోని వామపక్ష విద్యార్థి సంఘం జిల్లా సీనియర్ నాయకులు కామ్రేడ్ మర్రి స్వామి నేడు నందికొట్కూరు పట్టణంలోని విజ్ఞాన్ జూనియర్ కాలేజ్ నందు ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థి సంఘంలో పి.డి.ఎస్.యు రాష్ట్ర అధ్యక్షులు ఎస్.ఎండి రఫీ,సమక్షంలో చేరారు.ఈ సందర్భంగా పిడి.ఎస్.యు రాష్ట్ర అధ్యక్షులు ఎస్ .ఎండి రఫీ, మాట్లాడుతూ నందికొట్కూరు డివిజన్ పరిధిలోని విద్యారంగ సమస్యల పరిష్కారం కోసం నిరంతరం ఉద్యమించిన కామ్రేడ్ మర్రి స్వామి విప్లవ విద్యార్థి సంఘం పి.డి.ఎస్.యు లో చేరడం అభినందనీయం అని తెలియజేశారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అవలంబిస్తున్న విద్యావ్యతిరేక విధానాలను త్రిప్పికొట్టేందుకు విద్యార్థులు సంఘటితమై ఉద్యమించాలని పిలుపునిచ్చారు. కామ్రేడ్ మర్రి స్వామి మాట్లాడుతూ నిరంతరం విద్యారంగ సమస్యల పరిష్కారానికై ఉద్యమిస్తున్న విప్లవ విద్యార్థి సంఘం పిడిఎస్.యు లో చేరుతున్నానని తెలియజేశారు. శాస్త్రీయ విద్యా సాధన కోసం ,విద్యారంగ సమస్యల పరిష్కారం కోసం నేటి నుండి పి.డి.ఎస్.యు ఆధ్వర్యంలో ఉద్యమాలకు శ్రీకారం చేపడతామని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ప్రగతిశీల యువజన సంఘం జిల్లా కన్వీనర్ నవీన్ కుమార్,నాయకులు రవి,వంశీ,హరి, రమేష్,షాహీద్, వినయ్, తదితరులు పాల్గొన్నారు.

# ఆర్పి రమాదేవి అవినీతిపై విచారణ చేపట్టండి.






**ఆంధ్ర ప్రగతి నంద్యాల జిల్లా జూన్ 24:**
పొదుపు సంఘాలలో అక్రమాలకు పాల్పడుతూ పేద బడుగు బలహీన వర్గాల మహిళల సొమ్మును స్వాహా చేస్తున్న ఆర్పి రమాదేవి అవినీతిపై విచారణ చేపట్టాలని బహుజన్ సమాజ్ పార్టీ నంద్యాల జిల్లా ప్రధాన కార్యదర్శి కొత్తకోట విజయభాస్కర్ డిమాండ్ చేశారు. ఆమెరకు మంగళవారం పట్టణంలోని స్థానిక మున్సిపల్ కార్యాలయం ఎదుట పొదుపు మహిళలు ఆందోళన చేపట్టారు .ఈ సందర్భంగా విజయభాస్కర్ మాట్లాడుతూ పట్టణంలోని మయూరి పొదుపు సంఘానికి సంబంధించి న రెండు వాయిదాల డబ్బు ?1,40,000 లను గత సంవత్సరం కిందట బ్యాంకుకు చెల్లించకుండా సొంత ఖర్చులకు వాడుకుందని ,మహిళలు ప్రశ్నించడంతో తిరిగి ఆ సొమ్మును బ్యాంకులో జమ చేసిందని తెలిపారు .ఇదివరకే మెప్మా అధికారులకు ఫిర్యాదు చేసినప్పటికి ఆర్ పి రమాదేవి పై చర్యలు ఏమి తీసుకోలేదని అందుకే తాము ఆందోళన బాట పట్టామన్నారు .మయూరి గ్రూపుకు సంబంధించి గత లోన్ లో కూడా ఈ తరహా లోనే రెండు వాయిదాల సొమ్మును రమాదేవి కాజేసిందని ఆయన ఆరోపించారు. ఏళ్ల తరబడి ఆర్పి గా కొనసాగుతున్న రమాదేవి పై నిత్యం ఈ తరహా వివాదాలు చోటుచేసుకుంటున్నప్పటికీ ఆమెపై మెప్మా అధికారులు చర్యలు తీసుకోకపోవడంలో మర్మమేమిటో వారికే తెలియాలి అన్నారు. అవినీతి అక్రమాలను ప్రశ్నించిన మయూరి పొదుపు సంఘాన్ని డిఫాల్ట్ గ్రూపుగా చేస్తామంటూ బెదిరించడం అన్యామన్నారు. నిబంధనలకు విరుద్ధంగా పొదుపు లీడర్ గా కొనసాగుతున్న సచివాలయ ఉద్యోగిని లలితను వెంటనే గ్రూప్ లీడర్ గా తొలగించాలని వారు కోరారు .ఇప్పటికైనా అధికారులు ఆర్పి రమాదేవి అక్రమాలపై విచారణ చేపట్టి చర్యలు తీసుకోవాలని లేని పక్షంలో జిల్లా అధికారులకు సైతం ఫిర్యాదు చేస్తామని వారు తెలిపారు .అనంతరం మెప్మా అధికారులకు ఫిర్యాదు పత్రాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో శివన్న దొరపల్లె శ్రీను రామ్ మద్దిలేటి గుడ్ల సురేష్ పొదుపు మహిళలు పాల్గొన్నారు.

# ఎన్నో ఏళ్లుగా నెలకొన్న సమస్యకు పరిష్కారం చూపిన న్యాయవాది తులసి రెడ్డి.





**ఆంధ్ర ప్రగతి నంద్యాల జూన్ 24:**
ఎన్నో ఏళ్లుగా ఇరువర్గాల మధ్య నలుగుతున్న సమస్యకు పరిష్కారం దొరికింది. ప్రముఖ న్యాయవాది టిడిపి రాష్ట్ర కార్యదర్శి, ఏపీ మార్క్ ఫెడ్ డైరెక్టర్ తాతిరెడ్డి తులసిరెడ్డి జోక్యంతో వివాదం ముగిసింది. వివరాల్లోకి వెళితే నంద్యాల జిల్లా బండిఆత్మకూరు మండలం బి. కోడూరు గ్రామంలో ఏటా పీర్ల ఉత్సవాలు నిర్వహించడం ఆనవాయితీగా వస్తుంది. అయితే సుమారు 15 ఏళ్ల క్రితం అనుకోకుండా జరిగిన సంఘటనలో ఊరేగింపులో ఉన్న పీర్లు అదృశ్యం అయ్యాయి. పండుగ రోజున పీర్లను ఊరేగిస్తూ సమయంలో ఓ మతిస్థిమితం లేని వ్యక్తి పీర్లను సమీపంలోని కుందునదిలో పడేశాడు. అప్పట్లో స్థానికులు కుందులో పడిపోయిన పీర్లను బయటకు తీయడానికి చేసిన ప్రయత్నాలు ఫలించలేదు. దీంతో బి కోడూరు గ్రామ ప్రజలు ఆ విషయాన్ని దైవానికి వదిలివేశారు. అయితే సుమారు ఐదేళ్ల క్రితం నంద్యాల సమీపంలోని కుందు నదిలో పీర్ల నిమజ్జనం జరుగుతున్న సమయంలో అనుకోని సంఘటన చోటుచేసుకుంది. పీర్ల నిమజ్జన సమయంలో ఓ వ్యక్తికి బి కోడూరు గ్రామంలో అదృశ్యం అయిన పీరు దొరికింది. కుందునదిలో పీరు దొరికిన విషయం ఆనోటా... ఈనోటా బి కోడూరు గ్రామ ప్రజలకు తెలిసింది. దీంతో ఆగ్రామ ప్రజలు కుందునదిలో దొరికిన పీరు తన గ్రామానికి చెందిన చిన్న బాదుల్లా స్వామి వారి పీరుగా గుర్తించారు. అప్పటి నుంచి బి కోడూరు గ్రామ ప్రజలకు, నంద్యాల పట్టణంలోని చాంద్ బడా ప్రాంత వాసులకు మధ్య వివాదం నడుస్తూనే ఉంది. ఇరువర్గాల మధ్య పీర్ల వివాదం సెంటిమెంటుగా మారింది. తమకు దొరికిన స్వామి వారి పిరును ఇస్తే.. తమకేమైన అవుతుందేమో అని ఒక వర్గం భావిస్తే, తమ పీరును తమకు దక్కకపోతే ఏమవుతుందో,? అని ఇరువర్గాలు సెంటిమెంటుతో బలంగా వాదనకు దిగారు. అయితే ఈ విషయంలో తమకు న్యాయం చెయ్యాల్సిందిగా ప్రముఖ న్యాయవాది తాతిరెడ్డి తులసిరెడ్డిని కలిసి తమ సమస్యను వివరించారు. దీంతో తులసి రెడ్డి ఇరువర్గాలకు న్యాయం జరిగే విధంగా చక్కటి పరిష్కారం చూపించారు. చిన్న బాదుల్లా స్వామి పీరు ఎలా ఉందో... అచ్చుగుద్దినట్టు శ్రస్తోకంగా ఇస్లామిక్ శైలిలో... అదే ఆకారాన్ని పోలిన ఆలాంటి పీరును స్వయంగా తన ఖర్చుతో తయారు చేయించారు. మరో రెండు మూడురోజుల్లో మొహరం ప్రారంభం కానుండటంతో కొత్తగా తయారు చేసిన చిన్న బాదుల్లాస్వామి వారి పీరును ఇరువర్గాల సమక్షంలో తులసి రెడ్డి బి కోడూరు గ్రామ ప్రజలకు అందజేశారు. మతసామర్యానికి ప్రతీక అయిన మొహరం వేడుకలకు సహకరించడంతో పాటు, సమస్యను సామరస్యంగా పరిష్కరించిన తులసిరెడ్డికి ఇరువర్గాల పెద్దలు కృత్షతలు తెలిపారు.

# అనాధ దిక్కులేని పిల్లలకు ఆధార్ కార్డులు కలిగి ఉండాలి

**కర్నూలు జూన్ 24 ఆంధ్ర ప్రగతి**
జాతీయ మరియు రాష్ట్ర న్యాయ సేవ అధికార సంస్థల ఆదేశాల మేరకు జిల్లా న్యాయ సేవ అధికార సంస్థ ప్రధాన న్యాయమూర్తి జి. కబర్ధి సూచనల మేరకు జిల్లా న్యాయ సేవా అధికార సంస్థ, కార్యదర్శి బి. లీలా వెంకట శేషాద్రి మంగళవారం కర్నూలు జిల్లా న్యాయ సేవాసదన్ నందు గవర్నమెంట్ లైన్ డిపార్ట్మెంట్ల లతో ఏర్పాటు చేసిన సాథి కమిటీ తో ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఉన్న దిక్కులేని/అనాథ పిల్లలను గుర్తించడంపై సమీక్ష కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఈ సాథి కమిటీ ఉమ్మడి జిల్లా ల వ్యాప్తంగా స్పెషల్ డ్రైవ్ ను నిర్వహించి 125 మంది ఆధార్ కార్డ్స్ లేని పిల్లలను గుర్తించడం జరిగిందని జడ్జి తెలిపారు. వీరందరికి ఈ నెల 26 తరువాత నుంచి ప్రత్యేక ఆధార్ సెంటర్ లని ఏర్పాటు చేసి లైన్ డిపార్ట్మెంట్ ల సహకారం తో ఆధార్



కార్డ్స్ ఇప్పించడం జరుగుతుందని తెలిపారు. ఈ కమిటీ దిక్కులేని పిల్లలను గుర్తించి ఆధార్ కార్డులను ఇప్పించడంతో పాటు వివిధ గవర్నమెంట్ పథకాలతో అనుసంధానం చేసి విద్య మరియు గవర్నమెంట్ పథకాలన్నీ వర్తింప చేసేలా కృషి చేస్తాయని తెలిపారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ప్రతి ఒక్క అనాధ దిక్కులేని పిల్లలకు ఆధార్ కార్డులు కలిగి ఉండేలా ఈ డిపార్ట్మెంట్లన్నీ సమిష్టిగా కృషి చేయాలని తెలిపారు. ఎవరికైనా అనాధ




పిల్లలు కనిపించిన 15100 టోల్ ఫ్రీ నెంబర్ కు కాల్ చేస్తే వెంటనే న్యాయ సహాయం అందిస్తామని తెలిపారు. సమావేశంలో ఐసిడిఎస్ కర్నూలు మరియు నంద్యాల పిడి నిర్మల, లీలావతి, నంద్యాల అడిషనల్ డిస్ట్రిక్ట్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ శారద బాయి, కర్నూలు తహసీల్దార్ ఇంద్రాణి, ప్యానల్ లాయర్ వెంకటేశ్వర్లు మరియు ప్యారా లీగల్ వాలెంటీర్స్ రాయపాటి శ్రీనివాసులు,సుధారాణి, హేమంత్ మరియు సంబంధిత శాఖ అధికారులు పాల్గొన్నారు.

## పాత బిల్లులు కాకుండా.. కొత్త బిల్లులు ఎక్కించడం లో

# మతలబు ఏమిటో.?

### ఏ అధికారి వచ్చినా కాంట్రాక్టర్లకు న్యాయం జరగదా. 6 కోట్ల పాత బకాయిల కు మోక్షం లేదా.!

**ఆంధ్ర ప్రగతి నంద్యాల జూన్ 24:**

రాష్ట్రం లో అన్ని కార్పొరేషన్లు,మున్సిపాలిటీలు ఒక ఎత్తు అయితే,నంద్యాల మున్సిపాలిటీ రూటే సపరేటు అన్న చందంగా మారింది.కోట్లాది రూపాయలు పనులు చేసిన కాంట్రాక్టర్ల పరిస్థితి దారుణం గా మారింది.ప్రభుత్వం కాంట్రాక్టర్లకు చెల్లించాల్సిన పాత బకాయిలను నిధి పోర్టల్ లో ఎక్కించాలని ఆదేశాలు జారీ జారీ చేసిన విషయం విదితమే.రాష్ట్రంలో వివిధ ప్రాంతాల్లో పాత బకాయిలను నిధి పోర్టల్ లో ఎక్కిస్తున్నారు.నంద్యాలలో మాత్రం పాత బకాయిలను నిధి పోర్టల్ లో ఎక్కించకుండా ఇటీవల చేసిన కొన్ని పనులకు సంబంధించిన బిల్లులు ఎక్కిస్తున్నట్టు సమాచారం.వివరాల్లోకి వెళితే నంద్యాల మున్సిపాలిటీలో 2023 లో కాంట్రాక్టర్లు దాదాపు 6 నుంచి 7 కోట్లు పనులు చేశారు.పనులు పూర్తి అయినా కాంట్రాక్టర్లకు ప్రభుత్వం బిల్లులు ఇవ్వలేదు.కాంట్రాక్టర్లు ఎన్ని సార్లు అధికారులను అడిగినా పలితం లేకుండా పోయింది.కొందరికి మాత్రం గతంలో పనిచేసిన అధికారులు కొందరు 5 శాతం హస్తవాసి తీసుకుని బిల్లులు ఒకే చేసినట్టు ఆరోపణలు వినిపిస్తున్నాయి.గతంలో పనిచేసిన కొందరు అధికారులు బిల్లులు ఎక్కిస్తామని కొందరు కాంట్రాక్టర్ల వద్ద అడ్వాన్స్ సైతం తీసుకొని బదిలీ అయినట్టు సమాచారం.ఈ నేపథ్యంలోనే నంద్యాల మున్సిపల్ కమిషనర్ గా శేషన్న వచ్చారు.కాంట్రాక్టర్లు అందరూ కలసి ఆయన వద్దకు వెళ్లి పాత బిల్లులు నిధి పోర్టల్ లో ఎక్కించాలని విజ్ఞప్తి చేశారు.కాంట్రాక్టర్ల సమస్యలను అర్థం చేసుకొని అన్ని పరిశీలించి పాత బకాయిలను నిధి పోర్టల్ లో ఎక్కించే విధంగా చూస్తానని చెప్పినట్టు సమాచారం.కమిషనర్ బరోసా ఇవ్వడంతో కాంట్రాక్టర్లలో ఆశలు చిగురించాయి.ఏమైందో ఏమో తెలియదు కానీ పాత బకాయిలను నిధి పోర్టల్ లో ఎక్కించకుండా ఇటీవల చేసిన పనులకు సంబంధించిన బిల్లులు ఎక్కిస్తున్నట్టు




సమాచారం.అప్పులు చేసి పనులు చేసినా ఏళ్లు గడుస్తున్న బిల్లులు రాకపోవడంతో ,నంద్యాల మున్సిపాలిటీకి ఏ అధికారి వచ్చినా కాంట్రాక్టర్ల బ్రతుకులు ఇంతేనా అని ఆవేదన చెందుతున్నారు.గతంలో 50 నుంచి 60 మంది కాంట్రాక్టర్లు పనులు చేసేవారు.అప్పుల బాధ,వడ్డీల భాద భరించలేక ,బిల్లులు రాక కొందరు కాంట్రాక్టర్లు మున్సిపల్ కార్యాలయం వైపే కన్నెత్తి చూడడం లేదు.గత ప్రభుత్వం నేతలను కలిసినా పలితం లేకపోయింది.కూటమి ప్రభుత్వంలో దేవుడు వరమిచ్చినా పూజారి కనికరించడం లేదనే సమేత నంద్యాల మున్సిపాలిటీ కే దక్కుతుంది.పాత బకాయిలు ఎక్కించకుండా కొత్త బిల్లులు ఎక్కించడం లో మర్మం ఆ దేవుడికే తెలియాలి.ప్రస్తుతం కాంట్రాక్టర్లు ముందుకు రాకపోవడంతో అభివృద్ధి కుంటుపడింది.స్థానిక కాంట్రాక్టర్లు కాస్తో కూస్తో వచ్చే పనులకు ముందుకు రాకపోవడంతో ఇతర ప్రాంతాలనుంచి కాంట్రాక్టర్ లు వస్తుండడం కొసమెరుపు.ప్రస్తుతం నంద్యాల మున్సిపాలిటీలో అధికారుల పరిస్థితి ఎలా ఉందంటే వారికి కావాల్సిన జిరాక్స్ పేపర్లు కూడా లేని దుస్థితిలో ఉన్నారు.సొంత డబ్బులు పెట్టి పేపర్లు తెచ్చుకుంటున్నారంటే ఎంత దయనీయంగా మారిందో అర్థం అవుతుంది.ఇంటి పన్నులు,కొళాయి పన్నులు ప్రజలు కోట్లలో కడుతున్న మౌలిక సదుపాయాలు కల్పించడంలో ఘోరంగా విఫలం అయింది.నంద్యాలలో ఉన్న మానవతావాదులకు చిన్న మనవి.పెద్ద మనసు చేసుకొని కొన్ని జిరాక్స్ బండిల్లు ఇచ్చి ఆదుకుంటారని ఆశిస్తున్నాను.కొత్తగా కాంట్రాక్టర్ అవతారం ఎత్తిన కొందరికి మాత్రం బిల్లులు వస్తున్నాయని ఆరోపణలు వినిపిస్తున్నాయి.

# రైతులు పంటలకు భీమా చేయించుకోవాలి.

**మండల వ్యవసాయ అధికారి నాగేశ్వర్ రెడ్డి.**

**ఆంధ్ర ప్రగతి మహానంది జూన్ 24:**

రైతు ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజన పథకం క్రింద పంట బీమా చేసుకోవాలని మండల వ్యవసాయ అధికారి నాగేశ్వర్ రెడ్డి పేర్కొన్నారు. మంగళవారం మహానంది మండలంలోని నందిపల్లె, సీతారామపురం గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ...ప్రకృతి వైపరీత్యాల వలన పంట నష్టం సంభవించినప్పుడు, ఇన్సూరెన్స్ చేసుకున్న రైతులకు బీమా పరిహారం చెల్లించడం జరుగుతుందన్నారు.వరి పంటకు ఎకరాకు రూ. 800 , మొక్కజొన్న పంటకు ఎకరాకు రూ.660, కంది పంటకు ఎకరాకు రూ.400, మినుము పంటకు ఎకరాకు రూ.190 రూపాయలు ప్రీమియం చెల్లించవలసి ఉంటుందని తెలిపారు. వరి పంటను గ్రామము యూనిట్ గా, మొక్కజొన్న ,కంది, మినుము పంటలను మండలం యూనిట్ గా పరిగణిస్తారని రైతులకు తెలియజేయడం జరిగిందన్నారు.పంట రుణం తీసుకున్న రైతులకు సంబంధిత బ్యాంకు వారు ప్రీమియం వసూలు చేసి, బీమా కంపెనీకి నేరుగా చెల్లిస్తారని, పంట రుణం తీసుకొని రైతులు కామన్ సర్వీస్ సెంటర్లని సంప్రదించి ప్రీమియం చెల్లించాలన్నారు.వరి పంటకు ప్రీమియం చెల్లించడానికి చివరి తేదీ ఆగస్టు 15వ తేదీ గా నిర్ణయించారని, మిగతా పంటలకు జూలై 31 లోగా ప్రీమియం చెల్లించాలన్నారు. మొక్కజొన్న పంటలో కత్తెర పురుగు ఆశించినప్పుడు ఆకుల పైన రంధ్రాలు కనిపిస్తాయని, మొవ్వు లోపల పురుగు సంబంధించిన విసర్జన మల పదార్థము కూడా కనిపిస్తూ




ఉంటుందన్నారు. నివారణకు మొక్కజొన్న విత్తనానికి ఇమిడా క్లోప్రిడ్ అనే మందుతో ఐదు మిల్లీలీటర్లు కిలో విత్తనానికి కలిపి విత్తన శుద్ధి చేసుకోవాలని, పంట తొలి దశలో కత్తెర పురుగు గుడ్ల నివారణకు వేప నూనెను ఎకరాకు ఒక లీటర్ చొప్పున పిచికారి చేయాలని, అదేవిధంగా ఎకరాకు 5 నుండి 6 లింగాకర్షణ బుట్టలు పంటలో అమర్చుకొని పురుగు ఉధృతి గమనిస్తూ ఉండాలన్నారు. ఎకరాకు మూడు నుండి నాలుగు కిలోల కార్బో ఫ్యూరాన్ 3జి గుళికలను మువ్వ లో పడే విధంగా వేసుకోవాలని , పురుగును గమనించిన వెంటనే అశ్రద్ధ చేయకుండా క్లోరాంత్ర నిలిప్రోల్ అనే మందును 0.3 మిల్లీలీటర్లు ఒక లీటర్ నీటికి కలిపి పిచికారి చేసుకోవాలన్నారు. పంట దశలలో తయోడికార్బ్ అనే మందును 1 గ్రాము ఒక లీటర్ నీటికి లేదా స్పైనిటోరం అనే మందును 0.5 మి. లీ ఒక లీటర్ నీటికి లేదా ఇమామెక్టిన్ బెంజోయేట్ అనే మందును 0.4 గ్రాములు ఒక లీటర్ నీటికి లేదా స్పైనో సాడ్ అనే మందును 0.3 మి. లీ ఒక లీటర్ నీటికి కలిపి పిచికారి చేసుకోవాలన్నారు.పురుగు ఉధృతి ఎక్కువగా ఉన్నప్పుడు 10 కిలోల తవుడు, రెండు కిలోల బెల్లం , రెండు నుండి మూడు లీటర్ల నీరు కలిపి 24 గంటలు పులియబెట్టి సుడులలో వేసుకునే ముందు 100 గ్రాముల తయోడీకార్బ్ మందుని కలుపుకొని,విషపు ఏరగా తయారు చేసుకుని మొక్క సుడిల్లో వేయడం ద్వారా పురుగును సమర్థవంతంగా నివారించవచ్చునని తెలిపారు. కౌలుకు తీసుకున్న ప్రతి రైతు కౌలు కార్డు తీసుకోవాలని వరి పంటలో ఎకరాకు 20 కిలోల ముడి జింకు తప్పకుండా వేసుకోవాలని, భూసార పరీక్ష ఫలితాల ఆధారంగా ఎరువులు వాడాలన్నారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణ అధికారి శ్రీనివాస్ రెడ్డి, గ్రామ వ్యవసాయ సహాయకులు లక్ష్మీకాంత్,రైతులు పాల్గొన్నారు.

## ట్రిబుల్ ఐటీ లో సీట్లు సాధించిన మోడల్ స్కూల్ విద్యార్థులు.


**ఆంధ్ర ప్రగతి శిరివెళ్ళ జూన్ 24:** ఆదర్శ పాఠశాలలో చదివిన నలుగురు విద్యార్థులు ట్రిబుల్ ఐటి లో సీట్లు సాధించారని ఆదర్శ పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు డాక్టర్ ఇష్రాత్ బేగం ఓ ప్రకటన ద్వారా తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.10వ తరగతి పరీక్ష ఫలితాల్లో ఇద్దరు అమ్మాయిలు , ఇద్దరు అబ్బాయిలు ట్రిబుల్ ఐటీ లో సీట్లు సాధించారన్నారు. గుమ్మ కావ్య అనే విద్యార్థిని కు నూజివీడు లో, సిరి చందన అనే విద్యార్థినికి ఒంగోలు లో , హర్ష వర్ధన్ రెడ్డి మరియు తేజనాథ్ అనే విద్యార్థులకు ఆర్కే వ్యాలీ లలో , సీట్లు వచ్చినట్లు ఆమె తెలిపారు. సీట్లు సాధించిన విద్యార్థులను పాఠశాల ప్రధానోపాధ్యాయులు ,ఉపాధ్యాయులు , పాఠశాల సిబ్బంది ,తదితురులు అభినందించారు.




## అంతరిక్ష యాత్రకు ఎంపికైన తెలుగు అమ్మాయి

పాలకొల్లు **జూన్ 24 ఆంధ్ర ప్రగతి**

ఏపీలోని పశ్చిమగోదావరి జిల్లా పాలకొల్లుకు చెందిన దంగేటి జాహ్నవి అంతరిక్షం లోకి వెళ్లే అరుదైన అవకాశాన్ని దక్కించుకుంది. 23 ఏళ్ల జాహ్నవి 2029లో స్పేస్లోకి వెళ్లేందుకు అర్హత సాధించారు. యునైటెడ్ స్టేట్స్ కు చెందిన టైటాన్ స్పేస్ ఇండస్ట్రీస్ (%ఖూ×%) చేపట్టే టైటాన్ స్పేస్ మిషన్ కోసం ఓ వ్యోమగామిగా ఆమె ఎంపికయ్యారు. ఈ యాత్రలో భాగంగా జాహ్నవి అంతరిక్షంలో 5 గంటలపాటు ఉండనున్నారు. ఇందుకోసం ఆమెకు పలు దేశాల్లో ట్రైనింగ్ ఇస్తారు.




## వైకాపా నేత మనవడికి జగన్ అన్నప్రాసనం

**వైసిపి కార్యాలయంలో సందడిగా వేడుక**

అమరావతి, **జూన్ 24 ఆంధ్ర ప్రగతి**

ఓ చిన్నారికి వైఎస్ జగన్ చేతుల మీదుగా అన్నప్రాసన జరిగింది.. చిన్నారి ఆద్విక్‌ను ముద్దు చేస్తూ.. అన్నప్రాసన చేశారు వైఎస్ జగన్మోహన్‌రెడ్డి..తాడేపల్లిలోని వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ కేంద్ర కార్యాలయంలో వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌ను కలిశారు తూర్పుగోదావరి జిల్లా డీసీఎంఎస్ మాజీ ఛైర్మన్ సాక మణికుమారి, సాక ప్రసన్నకుమార్ తమ మనవడు చిన్నారి ఆద్విక్‌కు



అన్నప్రాసన చేయాలని.. ఈ సందర్భంగా వైఎస్ జగన్‌ను కోరారు మణికుమారి దంపతులు, ఆద్విక్ తల్లిదండ్రులు డాక్టర్ శృతి, ప్రేమ్‌కుమార్.. దీంతో, చిన్నారి ఆద్విక్‌ను ఎత్తుకుని.. ముద్దాడి అన్నప్రాసన చేశారు వైఎస్ జగన్.. ఇక, జగన్ చేతుల మీదుగా తమ చిన్నారికి అన్నప్రాసన జరగడంతో.. ఆనందం వ్యక్తం చేస్తున్నారు తల్లిదండ్రులు, కుటుంబ సభ్యులు.. మరోవైపు, తనను ఎత్తుకుని ముద్దు చూస్తున్న వైఎస్ జగన్ వైపు.. అలాగే చూస్తున్నాడు ఆ బుడ్డోడు.. ఇప్పుడో ఫొటోలు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి..

## సైబర్ నేరగాళ్ల ఉచ్చులో టెక్కీ

**పార్ట్‌టైమ్ జాబ్ పేరుతో బురిడీ**

**రెండు లక్షలకు పైగా లాగేసిన కేటుగాళ్లు**

తిరుపతి, **జూన్ 24 ఆంధ్ర ప్రగతి** సైబర్ నేరగాళ్లు రోజురోజుకు రెచ్చిపోతున్నారు. పోలీసులు ప్రజల్లో అవగాహన పెంచుతూ అప్రమత్తం చేస్తున్నప్పటికీ సైబర్ నేరగాళ్ల వలకు చిక్కుతున్నవారి సంఖ్య పెరుగుతూనే ఉంది. తిరుపతిలో ఓ సాఫ్ట్ వేర్ ఉద్యోగి సైబర్ నేరగాళ్ల వలలో పడి భారీగా సొమ్ము పోగొట్టుకున్నాడు. ఇందుకు సంబంధించి వివరాలిలా ఉన్నాయి. తిరుపతి రురల్ పోలీస్ స్టేషన్ పరిధిలో వర్క్ ఫ్రమ్ హోమ్ లో భాగంగా ఇంటి నుంచే పని చేస్తున్న ఓ సాఫ్ట్ వేర్ ఉద్యోగి సైబర్ నేరగాళ్ల మాయమాటలు నమ్మి రూ. 2 లక్షల 18 వేలు పోగొట్టుకున్నాడు. మొదట పార్ట్ టైం జాబ్ అంటూ బాధితుడికి వాట్సాప్ లో మెసేజ్ చేశారు కేటుగాళ్లు. కొన్ని లింకులు పంపి వాటికి రేటింగ్ ఇస్తే డబ్బులు ఇస్తామంటూ నమ్మించారు.అలా కొంత డబ్బులు ఇచ్చి తర్వాత పెట్టుబడి పెడితే లాభాలు వస్తాయంటూ ఆశ చూపారు కేటుగాళ్ళు. సైబర్ నేరగాళ్ల మాయమాటలు నమ్మిన బాధితుడు అకౌంట్లో ఉన్న రూ. 2 లక్షల 18 వెలను పంపాడు. ఆ తర్వాత ఎంతసేపటికి తన సొమ్ము తిరిగి ఇవ్వకపోవడంతో మోసపోయానని గ్రహించిన బాధితుడు పోలీసులను ఆశ్రయించాడు. బాధితుడు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు పోలీసులు. సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలని.. తక్కువ పెట్టుబడితో ఎక్కువ లాభం, పార్ట్ టైం జాబ్స్ అంటూ వచ్చే మెసేజ్ లను నమ్మి మోసపోవద్దని సూచిస్తున్నారు పోలీసులు.

# పొగాకు కొనుగోలు చేయాలని కోరుతూ కలెక్టర్ ఆఫీసు ముందు రైతుల రాస్తారోకో..!

### -రైతులకు పోలీసులకు మధ్య తోపులాట. -జాయింట్ కలెక్టర్ హామీతో తాత్కాలికంగా ఆందోళన విరమించిన రైతులు.

**ఆంధ్ర ప్రగతి నంద్యాల జూన్ 24:**

ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం ఆధ్వర్యంలో నంద్యాల జిల్లాలోని పొగాకు వేసినటువంటి రైతాంగం గత రెండు నెలల నుండి ఆందోళన చేస్తున్న రాష్ట్ర ప్రభుత్వం మరియు ప్రైవేటు కంపెనీలు రైతుల వద్ద ఉన్న మొత్తం పొగాకును కొనుగోలు చేయకుండా నిర్లక్ష్యం చేస్తున్నందువల్ల ఆగ్రహించిన రైతాంగం నేడు జిల్లా కలెక్టర్ కార్యాలయం ముందు జాతీయ రహదారి పై అడ్డంగాకూర్చొని రాస్తారోక నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా సిఐ కంబగిరి రాముడు పోలీస్ సిబ్బంది తో రైతులకు ఆందోళన విరమించే ప్రయత్నం చేయగా జిల్లా కలెక్టర్ పొగాకు కొనుగోలు కేంద్రాన్ని ఏర్పాటు చేసే విషయమై హామీ ఇచ్చేవరకు, రైతులను మోసం చేస్తున్న పొగాకు కంపెనీల పైన కఠినమైన చర్యలు తీసుకునే వరకు ఆందోళన విరమించేది లేదని రైతాంగం బిస్మించి కూర్చున్నారు. సీఐ కంభగిరి రాముడు జాయింట్ కలెక్టర్ తో మాట్లాడి, రైతులందరిని జేసీ క్ వద్దకు తీసుకు వెళ్తానని హామీ ఇవ్వడం తో ఆందోళన విరమించారు. అనంతరం జాయింట్ కలెక్టర్ రైతు సంఘాల నాయకులు రైతులతో పొగాకు కొనుగోలులో జరుగుతున్న లోపాలపై చర్చించి 3రోజుల లోపు ప్రభుత్వ కొనుగోలు కేంద్రం ప్రైవేటు కంపెనీల విషయంపై స్పష్టత ఇచ్చి రైతులకు న్యాయం జరిగేలా చర్య తీసుకుంటానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం ప్రధాన అధ్యక్షుడు టీ. రమేష్ కుమార్, జిల్లా ప్రధాన కార్యదర్శి ఏ. రాజశేఖర్, ల సహాయ కార్యదర్శి టి. రామచంద్రుడు లు మాట్లాడుతూ ప్రైవేటు పొగాకు కంపెనీలు ఒప్పందం చేసుకున్న మేరకు కూడా కొనుగోలు చేయకపోవడం, 18 వేల రూపాయలు క్వింటాలకు ఇవ్వాల్సిన కంపెనీలు 7000 నుండి 10000 రూపాయలు లోపు ఇస్తూ రైతులను దోపిడీ చేస్తున్న రాష్ట్ర ప్రభుత్వం జిల్లాలోని మంత్రులు ఎమ్మెల్యేలు ఏమాత్రం పట్టించుకోకుండా, రైతుల పట్ల పూర్తి నిర్లక్ష్య వైఖరి ప్రదర్శిస్తున్నారని, ఓట్ల సందర్భంగా రైతులను గుర్తించే పార్టీలు రైతులు ఇబ్బంది పడుతున్నారు. రోడ్లపై కొచ్చి ఆందోళన చేస్తున్న పాలక ప్రభుత్వాలు పట్టించుకోవడం లేదన్నారు. ముఖ్యమంత్రి గారు స్వయంగా రాష్ట్రంలో కొనుగోలు కేంద్రాలు చేస్తామని హామీ ఇవ్వడం ,మన జిల్లాకు వర్తింపక



చేయకపోవడంచ రాయలసీమ ప్రాంత రైతాంగాన్ని మోసం చేయడమే అన్నారు. అదేవిధంగా దోపిడీ చేస్తున్న కంపెనీలపైన కఠినమైన చర్యలు ఎందుకు తీసుకోలేకపోతున్నారో స్పష్టం చేయాల్సి ఉంది. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం వెంటనే జోక్యం చేసుకొని నంద్యాల జిల్లాలో ప్రభుత్వ కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేసి జిల్లాలో రైతుల వద్ద ఉన్న అన్ని రకాల మొత్తం పొగాకును వెంటనే కొనుగోలు చెయ్యాలని, ప్రైవేటు కంపెనీల పైన ప్రభుత్వం ఒత్తిడి పెట్టి రైతులందరి పోవాకును కొనుగోలు చేసేలా చర్యలు తీసుకోవాలని అట్లా జరగని పక్శంలో భవిష్యత్తులో రైతాంగం భరించృతమైన పోరాటాలు చేస్తారని అందుకు ప్రభుత్వమే బాధ్యత వహించాల్సి వస్తుందని అన్నారు. ఈ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు వి .సుబ్బరాయుడు, జిల్లా సహాయ కార్యదర్శి వెంకటేశ్వరరావు, మాజీ జిల్లా కార్యదర్శిపీ నరసింహుడు, కౌలు రైతు సంఘం అధ్యక్ష కార్యదర్శులు మార్క్, సుధాకర్ తో పాటు సిఐటి నాయకులు లక్ష్మణ్ , జిల్లాలోని 16 మండలాల పొగాకు రైతులు , రైతు సంఘం నాయకులు అతి శుభ నరసయ్య, పుల్లారెడ్డి, నారాయణ, రామ్మోహన్, వీరన్న, రామకృష్ణ, బుజ్జన్న, ప్రతాపరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# పహల్గామ్ దాడిపై కొనసాగుతున్న ఎన్ఐ దర్యాప్తు

### ఉగ్రవాదుల ప్రవేశంపై కూపీ లాగుతున్న పోలీసులు




న్యూఢిల్లీ, **జూన్ 24 ఆంధ్ర ప్రగతి:** పహల్గామ్ ఉగ్ర దాడిపై కేంద్ర సంస్థ ఎన్ఐఏ దర్యాప్తు కొనసాగిస్తోంది. ఇప్పటికే కీలక ఆధారాలను సేకరించింది. తాజాగా ఉగ్రవాదులు భారత్‌లోకి ఎలా ప్రవేశించారన్న దానిపై దర్యాప్తు చేపట్టగా అధికారులకు కీలక సమాచారం లభించింది. బాట్కోట్‌కు చెందిన పర్వైజ్ అహ్మద్ జోథర్, హిల్ పార్క్‌కు చెందిన బషీర్ అహ్మద్ జోథర్‌లను అనుమానంతో అదుపులోకి తీసుకుని విచారించారు. వీరిద్దరు ఉగ్రవాదులకు ఆశ్రయం కల్పించినట్లుగా ఒప్పుకున్నారు. ఇక పహల్గామ్ ఉగ్ర దాడి తర్వాత.. ముగ్గురు ఉగ్రవాదులకు హిల్ పార్క్‌లోని ఒక గుడిసెలో ఉన్నట్లుగా తేలింది. ఈ ఉగ్రవాదులకు స్థానికులైన పర్వైజ్, బషీర్ ఆహారం, ఇతర వసతులు కల్పించినట్లుగా తేలింది. అంతేకాకుండా ఎప్పటికప్పుడు కమ్యూనికేషన్ చేరవేసినట్లుగా గుర్తించారు. ఇక ముగ్గురు ఉగ్రవాదులు.. పాకిస్థాన్‌లోని అబోటాబాద్ నుంచి ముజఫరాబాద్ మీదుగా పూంజ్-రాజౌరికి చేరుకున్నట్లు అధికారులు గుర్తించారు. సరిహద్దు కారిడార్ ద్వారా భారత్‌లోకి ప్రవేశించి ఉంటారని దర్యాప్తు అధికారులు భావిస్తున్నారు. ఇక నిఘా వర్గాల దర్యాప్తు మేరకు.. ముగ్గురు ఉగ్రవాదులు కూడా అధిక శిక్షణ పొందినవారుగా కనిపెట్టారు. శిక్షణలో అధునాతన పోరాట పటిమలు కలిగిన వారిగా తేల్చారు. అంతేకాకుండా రహస్య కదలికలు, మనుగడ వ్యూహాలు కలిగి ఉన్నట్లుగా తేలింది. పహల్గామ్‌కు ముందు జమ్మూకాశ్మీర్‌లోని స్పిన్నర్ ప్రాంతంలో జరిగిన దాడులతో పాటు పలు దాడుల్లో ఈ ముగ్గురు ఉగ్రవాదులు పాల్గొని ఉండొచ్చని భావిస్తున్నారు. ఇక ఉగ్రవాదుల కదలికలు గురించి డిజిటల్ పాదముద్రలు, కమ్యూనికేషన్ మార్గాలను దర్యాప్తు సంస్థ విశ్లేషిస్తోంది. ప్రత్యేక కమ్యూనికేషన్ ఉపయోగించడం వల్ల ట్రాకింగ్ కష్టతరంగా మారింది. ప్రధానంగా స్థానికుల మద్దతుతోనే ఉగ్రవాదులు ఈ ఘాతుకానికి పాల్పడినట్లుగా గుర్తించారు. ప్రస్తుతం స్థానికులు ఇచ్చిన సమాచారంతో దర్యాప్తు కొనసాగిస్తున్నారు. ఏప్రిల్ 22న పహల్గామ్ ఉగ్రవాదులు చెలరేగిపోయారు. 26 మందిని పొట్టన పెట్టుకున్నారు. స్త్రీలను, పిల్లలను వదిలిపెట్టి భర్తలను చంపేశారు. పదుల కొద్ది గాయపడ్డారు. అనంతరం కేంద్ర ప్రభుత్వం.. పాకిస్థాన్‌పై కఠిన నిర్ణయాలు తీసుకుంది. ఇక మే 7న పాకిస్థాన్‌పై ఆపరేషన్ సిందూర్ చేపట్టింది. 100 మంది ఉగ్రవాదులు హతమయ్యారు. అంతేకాకుండా పాకిస్థాన్ వైమానిక స్థావరాలు కూడా తీవ్రంగా దెబ్బతిన్నాయి. మొత్తానికి పాకిస్థాన్ కాళ్ల బేరానికి రావడంతో భారత్ కాల్పుల విరమణకు అంగీకరించింది.

# మందలించినందుకు తల్లినే కాటికి పంపిన బాలిక

### ప్రియుడితో కలసి తల్లిని లేపేసిన టెన్త్ విద్యార్థిని

#### మృతురాలు వీరనారి చాకలి ఐలమ్మ మునిమనవరాలుగా గుర్తింపు





హైదరాబాద్, **జూన్ 24 ఆంధ్ర ప్రగతి**

హైదరాబాద్ జీడిమెట్ల పోలీస్ స్టేషన్ పరిధిలో దారుణం జరిగింది. సొంత కూతురే తల్లిని హత్య చేయించింది. అర్ధరాత్రి ఈ హత్య జరిగింది. హైదరాబాద్ శివారులోని జీడిమెట్లలో జరిగిన తల్లి హత్య కేసు రాష్ట్రవ్యాప్తంగా తీవ్ర కలకలం రేపుతోంది. ఓ పదో తరగతి చదువుతున్న బాలిక, ఆమె ప్రేమికుడు శివ, అతని తమ్ముడు కలిసి దారుణంగా తల్లి అంజలిని హత్య చేసిన ఘటన ఒక్కసారికి నగరాన్ని ఉలిక్కిపడేలా చేసింది. ప్రేమకు అడ్డు చెప్పిందనే కారణంతో కన్నతల్లిని పదో తరగతి చదివే కుమార్తె ప్రియుడితో కలిసి హతమార్చింది. మృతురాలు అంజలి.. తెలంగాణ వీరనారి చాకలి ఐలమ్మ మునిమనవరాలు కావడం గమనార్హం. పోలీసుల కథనం ప్రకారం.. విద్యార్థినికి కొన్ని రోజుల క్రితం ఇన్‌స్టాగ్రామ్‌లో ఓ యువకుడు పరిచయమయ్యాడు. అతడితో ప్రేమాయణం సాగించిన బాలిక ఇంటి నుంచి వెళ్లి పోయింది. తన కుమార్తె కనిపించడం లేదని తల్లి జీడిమెట్ల పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. పోలీసులు దర్యాప్తు చేస్తున్న క్రమంలో గత రాత్రి ప్రియుడితో కలిసి బాలిక ఇంటికి వచ్చింది. నిద్రిస్తున్న తల్లి అంజమ్మ గొంతు నులిమి, కర్రతో తలపై కొట్టి చంపినట్టు సమాచారం. ప్రియుడు, అతడి తమ్ముడితో కలిసి బాలిక ఈ దారుణానికి పాల్పడినట్టు పోలీసులు తెలిపారు. ఘటన అనంతరం నిందితులు అక్కడి నుంచి పరారయ్యారు. స్థానికుల సమాచారంతో ఘటనా స్థలికి చేరుకున్న పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహాన్ని పోస్టు మార్టం నిమిత్తం గాంధీ ఆసుపత్రికి తరలించారు. ప్రస్తుతం బాలికను పోలీసులు అదుపులోకి తీసుకుని విచారిస్తున్నట్టు సమాచారం. అయితే.. ఈ దారుణ ఘటనపై నిందితురాలు తేజ శ్రీ చెల్లి ప్రియచెప్పిన వివరాల మేరకు ..ట్యూషన్ నుంచి వస్తున్న నన్ను మా అక్క గల్లీ లోనే ఆపిందని, అమ్మ ఒక ఐటమ్‌ను తీసుకుని రమ్మంది. పదా వెళ్దాం అని తీసుకెళ్లిందని తెలిపింది. 20 నిమిషాల తర్వాత అక్కా నేను ఇంటికి చేరుకున్నామని, అప్పటికే కిచెన్ లో అమ్మ స్పృహ లేకుండా పడి ఉందని పేర్కొంది. అమ్మను నేను చూసుకుంటా.. నువ్వు బయటకు వెళ్ళి మీ ఫ్రెండ్ ఎవరినైనా తీసుకుని రా.. గల్లీలో ఆంటీ వాళ్లకు ఎవరికీ చెప్పకు అని చెప్పిందని వెల్లడించింది. అంతేకాకుండా.. మా అమ్మ ఇంకా చనిపోలేదు అని తెలుసుకున్న అక్క.. మళ్ళీ శివకి కాల్ చేసిందని, అమ్మ ఇంకా చనిపోలేదు. కాళ్లు చేతులు ఆడిస్తోంది అని చెప్పింది. మళ్ళీ శివ, యశ్వంత్ వచ్చారు. సుత్తితో అమ్మ తలపై కొట్టారు.. చనిపోయిందని నిర్ధారించుకున్న తర్వాత వెళ్ళిపోయారు.. నేను అప్పుడే వచ్చాను. చూసే సరికి అమ్మ రక్తపుమడుగులో పడి ఉంది.. వెళ్ళి చేతులు రుద్దాను.. లేపే ప్రయత్నం చేశాను. కానీ అక్క మాత్రం దగ్గరికి కూడా రాలేదు. అమ్మ చనిపోయింది లేపి వేస్ట్ అన్నదని ప్రియ వెల్లడించింది.

# రియల్ మోసంలో వైకాపా నేత తనయుడు

### ఒంగోలులో ఎపి ఇన్‌ఫ్రాకాన్ నేత విజయ్ అరెస్ట్

### గాలింపుతో పట్టుకున్న సైబరాబాద్ పోలీసులు

ఒంగోలు, **జూన్ 24 ఆంధ్ర ప్రగతి** రియల్ ఎస్టేట్ పేరుతో ఘరానా మోసానికి పాల్పడిన విజయవాడ వైసీపీ నేత, మాజీ డిప్యూటీ మేయర్ గోగుల రమణారావు కుమారుడు లక్ష్మి విజయ్ కుమార్‌ను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. హైదరాబాద్‌లో రియల్ ఎస్టేట్ స్కీంల పేరుతో విజయ్ చీటింగ్‌కు పాల్పడ్డాడు ఏపీ ఇన్ ఫ్రాన్ పేరుతో 22 రకాల ప్రాజెక్టుల పేర్లు చెప్పి కోట్ల రూపాయలు వరకు ప్రజల నుంచి వసూలు చేశాడు. అయితే పెట్టుబడి పెట్టిన వారికి ప్లాట్లు ఇవ్వకుండా మోసానికి పాల్పడ్డాడు. కాలం గడుస్తున్నప్పటికీ తమకు ప్లాట్లు రాకపోవడంతో మోసపోయినట్లు గుర్తించిన బాధితులు సైబరాబాద్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసిన పోలీసులు ఎట్టకేలకు ఒంగోలులో లక్ష్మి విజయ్ కుమార్‌ను అదుపులోకి తీసుకున్నారు.

ఉమ్మడి కృష్ణా, గుంటూరు జిల్లాల్లో దాదాపు 200 మంది బాధితులను లక్ష్మి విజయ్ కుమార్ మోసం చేసినట్లు తెలుస్తోంది. వెయ్యి కోట్లు టర్నోవర్ ఉన్న పెద్ద రియల్ ఎస్టేట్ సంస్థ అంటూ జోరుగా ప్రచారం చేశాడు. ఎత్తైన భవనాలు, ఆకర్షణీయ వెంచర్లను చూపి ప్రజలను ఆకర్షించే ప్రకటనలు చేశాడు. పథకాల పేరుతో దగా చేసిన వైనం బయటపడింది. అమ్మకాలు అద్భుతంగా ఉన్నాయంటూ మోసం చేసి ప్రజల నుంచి కోట్లలో వసూలు చేశాడు. విజయ్ కుమార్‌ను నమ్మి అద్భుతమైన ప్లాట్లు సొంతమవుతాయని భావించిన బాధితులు తమ దగ్గర ఉన్నదంతా పెట్టుబడిగా పెట్టేశారు. అయితే ఎన్ని రోజులైనా విజయ్ కుమార్ ప్లాట్లు ఇవ్వకపోవడంతో అతడిని నిలదీశారు. అడిగిన వారిని వాట్సప్ గ్రూపుల్లో తొలగించి, కార్యాలయానికి రాకుండా ఆంక్షలు విధించాడు విజయ్. స్కీమ్-1లో రూ.2 నెలవారి వడ్డీ, స్కీమ్-3లో రూ.3 వడ్డీ మూడు నెలలకు ఒకసారి చెల్లింపులు అంటూ చేతులెత్తేశాడు. దీంతో బాధితులు పోలీసులను ఆశ్రయించారు. ప్రభుత్వం కూడా స్పందించి తమకు న్యాయం చేయాలని వారు కోరుతున్నారు. పోలీసులు కేసు నమోదు చేసి లక్ష్మి విజయ్‌ను అరెస్ట్ చేసేందుకు ముమ్మరంగా గాలింపు చర్యలు చేపట్టారు. అయితే కేసు నమోదు అవడంతో పోలీసులకు చిక్కకుండా తప్పించుకునే ప్రయత్నం చేశాడు. కానీ చివరకు ఒంగోలులో విజయ్ కుమార్‌ను సైబరాబాద్ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు.

# దేశంలోనే బ్లాక్ బాక్స్ విశ్లేషణ

### విదేశాలకు పంపినట్లు పుకార్లు మాత్రమే - కేంద్రమంత్రి రామ్మోహన్ నాయుడు స్పష్టీకరణ



పుణె, **జూన్ 24 ఆంధ్ర ప్రగతి**అహ్మదాబాద్ విమానప్రమాదం తరవాత విశ్లేషణ కోసం బ్లాక్ బాక్స్‌ను అమెరికా పంపినట్టు వస్తున్న ఊహాగానాలను కేంద్ర పౌరవిమానయాన శాఖ మంత్రి కె.రామ్మోహన్ నాయుడు మంగళవారంనాడు తోసిపుచ్చారు. 'అవన్నీ ఊహాగానాలే. బ్లాక్ బాక్స్ ఇండియాలోనే ఉంది. ప్రస్తుతం దీనిని ఎయిర్‌క్రాఫ్ట్ యాక్సిడెంట్ ఇన్వెస్టిగేషన్ బ్యూరో (ఏఏఐబీ) పరిశీలిస్తోందని రామ్మోహన్ నాయుడు చెప్పారు. ఎప్పటిలోగా బ్లాక్ బాక్స్‌లోని సమాచారాన్ని వెలికితీసే అవకాశం ఉందని అడిగినప్పుడు, ఏఏఐబీ దర్యాప్తు చేపట్టి మొత్తం ప్రక్రియను పరిశీలించనీయండని అన్నారు. విమానం కూలిపోవడానికి ముందు ఏమి జరిగిందో లోతుగా తెలుసుకునేందుకు బ్లాక్ బాక్స్ డీకోడింగ్ జరుగుతోందని ఇంతకుముందు మంత్రి చెప్పారు.అహ్మదాబాద్‌లో ఎయిరిండియా విమానం కుప్పకూలిన దుర్ఘటన యావత్ ప్రపంచాన్ని తీవ్ర దిగ్భ్రాంతికి గురిచేసింది. అహ్మదాబాద్ నుంచి లండన్ బయల్దేరిన ఎయిరిండియా విమానం టేకాఫ్ అయిన కొద్దిసేపటికే కుప్ప కూలడం వెనుక గల కారణాలను అన్వేషించేందుకు ఉన్నత స్థాయి దర్యాప్తును అధికారులు కొనసాగిస్తు న్నారు. ప్రమాదానికి కొద్ది క్షణాల ముందు ఈ విమానంలో అసలేం జరిగిందో తెలుసుకోనేందుకు అందరి దృష్టీ ఇప్పుడు 'బ్లాక్ బాక్స్' విశ్లేషణపై పడింది. ఈ నేపథ్యంలో బ్లాక్‌బాక్స్‌ను విచారణ కోసం విదేశాలకు పంపించారంటూ జరుగుతోన్న ప్రచారాన్ని కేంద్ర విమానయానశాఖ మంత్రి రామ్మోహన్ నాయుడు తోసిపుచ్చారు. అవన్నీ కేవలం ఊహాగానాలేనంటూ కొట్టిపారేశారు. ఫిక్కీ, కేంద్ర విమానయాన మంత్రిత్వశాఖ సంయుక్త ఆధ్వర్యంలో పుణెలో జరిగిన హెలికాప్టర్స్ అండ్ స్మాల్ ఎయిర్‌క్రాఫ్ట్ సమ్మిట్ 2025 సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడారు. ఈ సందర్భంగా బ్లాక్ బాక్స్‌ను విదేశాలకు పంపిస్తున్నారా? అని విలేకర్లు అడగ్గా.. 'అవన్నీ కేవలం ఊహాగానాలే. బ్లాక్‌బాక్స్ భారత్‌లోనే ఉంది. దీన్ని ప్రస్తుతం ఎయిర్‌క్రాఫ్ట్ యాక్సిడెంట్ ఇన్వెస్టిగేషన్ బ్యూరో పరిశీలిస్తోంది' అని స్పష్టం చేశారు. ఎప్పటివరకు దీంట్లోని డేటాను పొందొచ్చని మరో ప్రశ్నకు స్పందిస్తూ.. 'ఇది చాలా సాంకేతికతతో కూడిన వ్యవహారం. ఏఏఐబీ దర్యాప్తు చేపట్టి మొత్తం ప్రక్రియను పరిశీలించనివ్వండి' అన్నారు. జూన్ 12న లండన్ వెళ్లేందుకు అహ్మదాబాద్ విమానాశ్రయం నుంచి టేకాఫ్ అయిన విమానం గాల్లోకి ఎగిరిన కాసేపటికే ఓ వైద్య కళాశాల వసతిగృహంపై కూలడం పెను విషాదం నింపింది. ఈ ఘటనలో 240 మంది ప్రయాణికులతో పాటు 270మంది ప్రాణాలు కోల్పోగా.. విమాన ప్రయాణికుల్లో ఒకే ఒక్కరు ప్రాణాలతో బయటపడ్డారు. ఈ క్రమంలో జూన్ 13న ఎయిరిండియా బోయింగ్ 787 -8 డ్రీమ్‌లైనర్ విమానం బ్లాక్ బాక్స్‌ను అధికారులు ఘటనా స్థలంలో స్వాధీనం చేసుకున్నారు. బ్లాక్ బాక్స్ అనేది విమానంలో ఏం జరిగిందో అన్న సమాచారాన్ని రికార్డు చేసే ఓ చిన్న పరికరం. ఇది విమాన ప్రమాదాల దర్యాప్తులో దీన్ని డీకోడ్ చేయడం వల్ల విమాన ప్రమాదానికి కొన్ని క్షణాల ముందే ఏం జరిగిందో తెలుసుకొనేందుకు ఉపయోగపడుతుంది.

# జగన్ పై మారుతున్న కాంగ్రెస్ లెక్కలు ..!

### జగన్ తో పెట్టుకోవడం వలన నాటి నుంచి ఏపీలో కాంగ్రెస్ తిరిగి కోలుకోలేదు.

**అమరావతి జూన్ 24 ఆంధ్ర ప్రగతి**

ఏపీ రాజకీయ సమీకరణాలు మారుతున్నాయి. జగన్ లక్ష్యంగా ఏపీ రాజకీయం నడుస్తోంది. ఏడాది పాలన పూర్తి చేసుకున్న మూడు పార్టీల కూటమి 2029 ఎన్నికల దిశగా రాజకీయ వ్యూహాలను అమలు చేస్తోంది. ఇటు జగన్ సైతం కూటమి పైన పోరుబాటకు సిద్దం అవుతున్నారు. ఇక, ఏపీ లో కాంగ్రెస్ కొత్త గేమ్ మొదలు పెట్టింది. ఏపీలో ఎన్డీఏ ప్రభుత్వం కొనసాగుతున్న వేళ.. జాతీయ స్థాయి లో బీజేపీ - ఆ పార్టీ మిత్రపక్షాల పై పోరాటం చేస్తున్న కాంగ్రెస్ తీరు ఏపీలో భిన్నంగా ఉంది. ఇప్పుడు తాజాగా పార్టీ హైకమాండ్ వ్యూహం ఏంటనేది స్పష్టంగా కనిపిస్తోంది.

**మారుతున్న లెక్కలు.**

కాంగ్రెస్ నాయకత్వాన్ని ఎదిరించి సొంత పార్టీ ఏర్పాటు చేసుకొని జగన్ సీఎం అయ్యారు. నాటి నుంచి ఏపీలో కాంగ్రెస్ తిరిగి కోలుకోలేదు. మూడు అసెంబ్లీ ఎన్నికల్లోనూ ఒక్క అసెంబ్లీ సీటు గెలవలేదు. కాంగ్రెస్ నుంచి వీడి జగన్ వద్దకు వెళ్లిన వారిని తిరిగి సొంత పార్టీలోకి తీసుకొచ్చేందుకు జగన్ తో ఉన్న వైరం రాజకీయంగా కలిసి వస్తుందనే ఉద్దేశంతో షర్మిల కు పీసీసీ చీఫ్ పగ్గాలు ఇచ్చారనే విశ్లేషణలు ఉన్నాయి. అయితే, షర్మిల ఆశించిన స్థాయిలో పార్టీ బలోపేతం చేయటం లో సక్సెస్ కావటం లేదనే అభిప్రాయం ఉంది. దేశ వ్యాప్తంగా ఎన్డీఏ పైన పోరాటం



చేస్తున్న కాంగ్రెస్ ఏపీలో భిన్నంగా వైసీపీని లక్ష్యంగా చేసుకుంటోంది. తాజాగా, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ఇంఛార్జ్ మాణికం ఠాగూర్ సైతం జగన్ లక్ష్యంగా తీవ్ర విమర్శలు గుప్పించారు.

**కాంగ్రెస్ టార్గెట్**

లిక్కర్ కేసు విచారణలో భాగంగా వస్తున్న ఆరోపణలను ప్రస్తావించారు. తాడేపల్లి, అమరావతిలో జగన్ నిధులు దాచి పెట్టారంటూ సంచలన వ్యాఖ్యలు చేసారు. ఏపీలో ఉన్న కాంగ్రెస్ సీనియర్లు మాత్రం నామ మాత్రంగానే వ్యవహరిస్తున్నారు. చింతా మోహన్ లాంటి వారు మినహా మిగిలిన కాంగ్రెస్ నేతలు పార్టీ వ్యవహారాలకు దూరంగా ఉంటున్నారు. దీంతో, తమ పార్టీకి నష్టం చేసిన జగన్ ఏపీలో తమ టార్గెట్ అనే విధంగా కాంగ్రెస్ స్పష్టమైన సంకేతాలు ఇస్తోంది. ఇలా వరుసగా కూటమి.. కాంగ్రెస్ తో పాటుగా మద్దతు దారుల నుంచి ముప్పేట దాడి ఎదుర్కొంటున్న జగన్.. పార్టీని ఎలా కాపాడుకుంటారు.. రానున్న రోజుల్లో ఎలాంటి కార్యాచరణతో ముందుకు వస్తారనేది ఇప్పుడు ఆసక్తి కరంగా మారుతోంది.

**కీలక సమీకరణాలు.**

ఏపీలో 2024 ఎన్నికల వేళ కీలక అనూహ్య సమీకరణాలు తెర మీదకు వచ్చాయి. మూడు పార్టీల కూటమి వర్సస్ జగన్ అన్నట్లుగా ఎన్నికలు జరిగినా.. షర్మిల సైతం వైసీపీ ఓటమి కోసం తన వంతు పాత్ర పోషించారు. షర్మిల - సునీత జగన్ కు వ్యతిరేకంగా ప్రచారం చేసారు. ఎన్నికల్లో ఓడిన తరువాత సైతం కూటమి ప్రభుత్వం కంటే జగన్ పైనే షర్మిల ఎక్కువగా విమర్శలు చేస్తు న్నారు. దీంతో, కాంగ్రెస్ నేతలు సైతం షర్మిల తీరు పైన హైకమాండ్ కు ఫిర్యాదులు చేసారు. తన అన్న పైన కోపంతోనే షర్మిల పీసీసీ చీఫ్ గా కూటమి ప్రభుత్వం కంటే ఎక్కువగా జగన్ ను టార్గెట్ చేస్తున్నారని కాంగ్రెస్ నేతలే లేఖల్లో పేర్కొన్నారు. కాగా, జగన్ విషయంలో కాంగ్రెస్ పార్టీ అధి నాయకత్వం వైఖరి స్పష్టం అవుతోంది.

# మృత్యువులా దూసుకువచ్చిన లారీ

### వాహనాలపై దూసుకు పోవడంతో ముగ్గురు మృతి



అనకాపలి **జూన్ 24 ఆంధ్ర ప్రగతి** మృత్యువులా దూసుకువచ్చిన ఓ లారీ ముగ్గురిని పొట్టన పెట్టుకుంది. ఈ ప్రమాదంలో 16 మందికి గాయాలయ్యాయి. అనకాపల్లి జిల్లా పరవాడ జాతీయ రహదారిపై లంకెలపాలెం కూడలి వద్ద సోమవారం రాత్రి జరిగిన ఈ ప్రమాదం స్థానికులు, వాహనదారులను తీవ్ర భయాందోళనకు గురిచేసింది. కూడలి వద్ద సిగ్నల్ పడడంతో వాహనాలు ఆగి ఉన్న సమయంలో గాజువాక నుంచి అనకాపల్లి వైపు ఓ లారీ అమితవేగంతో వచ్చి ముందు ఆగి ఉన్న మూడు కార్లు, 10 వరకు ద్విచక్రహనాలను ఢీకొడుతూ దూసుకుపోయింది. అదే సమయంలో పరవాడ వైపు వెళున్న కంటెయినర్ లారీని ఢీకొని ఆగింది. ఈ ప్రమాదంలో అనకాపల్లి మండలం రేబాకకు చెందిన పచ్చికూర గాంధీ (52), అనకాపల్లిలోని రింగురోడ్డు ప్రాంతానికి చెందిన కొణతాల అచ్చయ్యనాయుడు (55), విశాఖపట్నం జిల్లా అగనంపూడికి చెందిన యర్రప్పడు (30) మృతిచెందారు. గాయపడిన ఏడుగురు అనకాపల్లి ఆసుపత్రిలో, మరో తొమ్మిదిమంది అగనంపూడి ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. ప్రమాదానికి కారణాలపై పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

# తేలిపోయిన భారత బౌలర్లు

## డకెట్ శతకం.. క్రాలే, రూట్ అర్ధసెంచరీలు తొలి టెస్టులో గిల్ సేన ఓటమి



లీడ్స్: తమ టెస్టు చరిత్రలో ఎన్నడూ లేని విధంగా భారత్ నుంచి ఐదు శతకాలు నమోదైనా ఫలితం లేకపోయింది. తొలి నాలుగు రోజులు భారత్ చేతిలోనే ఉన్న మ్యాచ్‌ను చివరి రోజు ఇంగ్లండ్ అద్భుత బ్యాటింగ్‌తో లాగేసుకుంది. 371 పరుగుల ఛేదన కోసం బరిలోకి దిగిన స్టోక్స్ సేన 5 వికెట్ల తేడాతో ఘనవిజయం సాధించింది. అలాగే ఐదు టెస్టుల సిరీసలో 1-0తో ముందంజ వేసింది. ఓపెనర్ డకెట్ (170 బంతుల్లో 21 ఫోర్లు, 1 సిక్స్‌తో 149) శతకానికి క్రాలే (65), రూట్ (53 నాటౌట్) అర్ధసెంచరీలు తోడు కావడంతో ఇంగ్లండ్ రెండో ఇన్నింగ్స్‌లో 82 ఓవర్లలో 373/5 స్కోరుతో నెగ్గింది. జేమీ స్మిత్ (44 నాటౌట్), స్టోక్స్ (33) సహకారం అందించారు. శార్దూల్, ప్రసిద్ధ్‌లకు రెండేసి వికెట్లు దక్కాయి. మంగళవారం ఒక్క రోజే ఆతిథ్య జట్టు తమకు కావాల్సిన 350 పరుగులను రాబట్టడం విశేషం. భారత్ తొలి ఇన్నింగ్స్‌లో 471, రెండో ఇన్నింగ్స్‌లో 364 పరుగులు చేయగా, ఇంగ్లండ్ తొలి ఇన్నింగ్స్‌లో 465 పరుగులు చేసింది.

చెమటోడ్చారు..: 21/0 ఓవర్‌నైట్ స్కోరుతో 371 పరుగుల ఛేదన ఆరంభించిన ఇంగ్లండ్ ఓపెనర్లు డకెట్, క్రాలే భారత బౌలర్లను సునాయాసంగా ఎదుర్కొన్నారు. తొలి గంట కాస్తఆచితూచి ఆడినా ఆ తర్వాత చెలరేగారు. ముఖ్యంగా డకెట్ దూకుడుగా కనిపించాడు. పేసర్ బుమ్రా మినహా సిరాజ్, ప్రసిద్ధ్, శార్దూల్ లయను అందుకోలేకపోయారు. అటు ఓపెనర్లు బుమ్రాను జాగ్రత్తగా ఆడేస్తూ మిగతా పేసర్ల ఓవర్లలో బౌండరీలతో స్కోరును పెంచారు. దీంతో తొలి సెషన్‌లో వికెట్ కోల్పోకుండా 96 పరుగులు సాధించింది.%డకెట్ శతకం: లంచ్ బ్రేక్ తర్వాత ఇంగ్లండ్ స్కోరులో మరింత వేగం పెరిగింది. అటు భారత్ సైతం నాలుగు వికెట్లు తీయగలిగింది. డకెట్ చకచకా ఫోర్లు బాదేస్తూ సెంచరీ వైపు సాగాడు. అయితే తను 97 పరుగుల వద్ద ఉన్నప్పుడు ఇచ్చిన క్యాచ్‌ను జైస్వాల్ వదిలేశాడు. ఈ టెస్టులో అతడు క్యాచ్‌లు వదిలేయం ఇది నాలుగోసారి. ఆ వెంటనే ఫోర్‌తో డకెట్ కెరీర్‌లో ఆరో శతకం పూర్తి చేశాడు. ఇక 41వ ఓవర్ సమయంలో వర్షం వల్ల 20 నిమిషాలపాటు అంతరాయం కలిగింది. ఆ తర్వాత భారత్ ఎదురుచూపులు ఫలించాయి. దాదాపు మూడు సెషన్ల పాటు విసిగించిన ఓపెనింగ్ జోడీని పేసర్ ప్రసిద్ధ్ విడదీశాడు. చక్కటి అవుట్ స్వింగర్‌తో క్రాలేను అవుట్ చేయడంతో తొలి వికెట్‌కు 188 పరుగుల భారీ భాగస్వామ్యం ముగిసింది. ప్రసిద్ధ్ తన తర్వాతి ఓవర్‌లోనే పోప్ (8)ను బౌల్డ్ చేసి రిలీఫనిచ్చాడు. అటు డకెట్ మాత్రం ఎదురుదాడి సాగిస్తూ ప్రసిద్ధ్ ఓవర్‌లో రెండు ఫోర్లు, జడేజా ఓవర్‌లో సిక్సర్‌తో ధాటిని చూపాడు. కానీ 55వ ఓవర్‌లో డకెట్, బ్రూక్ (0)లను వరుస బంతుల్లో వెనక్కి పంపిన శార్దూల్ గట్టి ఝలక్ ఇచ్చాడు. 59వ ఓవర్‌లో వర్షం రెండోసారి అంతరాయం కలిగించడంతో అంపైర్లు టీ బ్రేక్‌ను ప్రకటించారు. అప్పటికి ఇంగ్లండ్ విజయానికి 102 పరుగుల దూరంలో ఉంది.

ధనాధన్ ఆటతో: ఆసక్తికరంగా ఆరంభమైన చివరి సెషన్‌లో రూట్-స్టోక్స్ జోడీ అడపాదడపా బౌండరీలతో లక్ష్యం వైపు సాగింది. అటు ప్రసిద్ధ్ ఓవర్‌లో రెండు ఫోర్లతో ఆకట్టుకున్న స్టోక్స్ ఐదో వికెట్‌కు 49 పరుగులు జోడించి జడేజాకు చిక్కాడు. ఇక ఆ తర్వాత రూట్‌కు జత కలిసిన జేమీ స్మిత్ ధనాధన్ ఆటతీరుతో విజయాన్ని ఖాయం చేశాడు. కొత్త బంతిని తీసుకున్నాక మరింత చెలరేగిన తను 82వ ఓవర్‌లో 4,6,6తో 18 పరుగులు సాధించి మ్యాచ్‌ను ముగించాడు.



# సెంచరీతో చెలరేగిన తిలక్ వర్మ

టీమిండియా యువ క్రికెటర్, తెలుగు తేజం తిలక్ వర్మ సెంచరీతో చెలరేగాడు. హాంప్‌షైర్ తరఫున కౌంటీ క్రికెట్‌లోకి అరంగేట్రం చేసిన తిలక్ వర్మ.. ఎస్సెక్స్‌తో జరిగిన తొలి మ్యాచ్‌లోనే శతకాన్ని అందుకున్నాడు. 239 బంతుల్లో మూడెంకల స్కోర్ అందుకొని కెరీర్‌లో ఆరో ఫస్ట్ క్లాస్ సెంచరీని ఖాతాలో వేసుకున్నాడు. సెంచరీ పూర్తయిన వెంటనే సిమన్ హార్మర్ బౌలింగ్‌లో సౌతాఫ్రికా మాజీ కెప్టెన్ డీన్ ఎల్గర్‌కు క్యాచ్ ఇచ్చి వెనుదిరిగాడు. అయితే ఈ మ్యాచ్‌లో తిలక్ వర్మ దూకుడుగా కాకుండా అసలు సిసలు టెస్ట్ బ్యాటింగ్ చేశాడు. చాలా ఓపికగా ఆడాడు. క్రీజులోకి వచ్చి రావడంతోనే హ్యాట్రిక్ బాల్ ఫేజ్ చేసిన తిలక్ వర్మ.. కండిషన్స్ గౌరవిస్తూ ఆచితూచి ఆడాడు. మూడో వికెట్‌కు 62 పరుగులు జోడించిన తిలక్ వర్మ.. నాలుగో వికెట్‌కు 68, ఐదో వికెట్‌కు 133 పరుగుల భాగస్వామ్యాన్ని అందించాడు. తిలక్ సూపర్ బ్యాటింగ్‌తో ఈ మ్యాచ్‌లో హాంప్‌షైర్ భారీ స్కోర్ స్కోర్ దిశగా సాగుతోంది. ఇప్పటికే 393 పరుగులు చేసింది. ఈ మ్యాచ్‌లో ముందుగా బ్యాటింగ్ చేసిన ఎస్సెక్స్ 296 పరుగులు చేసింది. భారత్ తరఫున ఇప్పటికే పరిమిత ఓవర్ల క్రికెట్ ఆడిన తిలక్ వర్మ.. టెస్ట్ ఫార్మాట్‌లోకి వచ్చేందుకు ప్రయత్నిస్తున్నాడు.భారత్ తరఫున 4 వన్డేలతో పాటు 25 టీ20లు ఆడిన తిలక్.. ఇప్పటి వరకు 18 ఫస్ట్ క్లాస్ మ్యాచ్‌లు ఆడాడు. టెస్ట్ క్రికెట్ తన ఫేవరేట్ ఫార్మాట్ అని తిలక్ వర్మ తెలిపాడు. సెంచరీ అనంతరం హాంప్‌షైర్ క్రికెట్ యూట్యూబ్ ఛానెల్‌తో మాట్లాడాడు. టెస్ట్ క్రికెట్‌లో అవకాశం కోసం ఎదురు చూస్తున్నానని తెలిపాడు. 'టీ20ల్లో మూడో ర్యాంక్ సాధించడంతో అందరూ నేను టీ20 స్పెషలిస్ట్ బ్యాటర్ అనుకుంటున్నారు. కానీ నేను మంచి టెస్ట్ బ్యాటర్‌ని. ఈ విషయాన్ని చాలా రోజులుగా చెబుతున్నా. శరీరానికి దగ్గరగా ఆడటం నాకు చాలా ఇష్టం. ఇలా ఆడటం సవాల్‌గా ఉంటుంది.'అని తిలక్ వర్మ తెలిపాడు. హాంప్‌షైర్ తరఫున అతను నాలుగు మ్యాచ్‌లు ఆడనున్నాడు.

# బుమ్రా కంటే షమీనే బెస్ట్ బౌలర్

## టీమిండియా వెటరన్ బ్యాటర్ చతేశ్వర్ పుజారా



టీమిండియా స్టార్ పేసర్ జస్‌ప్రీత్ బుమ్రాపై సర్వత్రా ప్రశంసల జల్లు కురుస్తున్నాయి. ఇంగ్లండ్‌తో తొలి టెస్ట్‌లో బుమ్రా ఐదు వికెట్లతో సత్తా చాటాడు. మిగతా బౌలర్లంతా విఫలమైన ఫ్లాట్ వికెట్‌పై వైవిధ్యమైన బౌలింగ్‌తో ఆకట్టుకున్నాడు. ఈ క్రమంలోనే బుమ్రా టీమిండియా కోహినూర్ అని ఒకరంటే.. వరల్డ్ బెస్ట్ పేసరని మరొకరు ప్రశంసించారు. భారత దిగ్గజ పేసర్ కపిల్ దేవ్ కంటే కూడా బుమ్రా అత్యుత్తమ పేసర్ అని కొనియాడారు. కానీ టీమిండియా వెటరన్ బ్యాటర్ చతేశ్వర్ పుజారా మాత్రం భిన్నమైన వ్యాఖ్యలు చేశాడు.బుమ్రాలో ప్రత్యేకమైన బౌలింగ్ నైపుణ్యం ఉన్నప్పటికీ.. సీమ్ పొజిషన్ విషయంలో మహమ్మద్ షమీనే అత్యుత్తమమని చెప్పాడు. షమీ సీమ్ పొజిషన్‌కు బుమ్రా దగ్గరకు కూడా రాలేదని తెలిపాడు. కానీ షమీ లేజీ బౌలరని, ఫిట్‌నెస్‌ను కాపాడుకోలేక జట్టుకు దూరమయ్యాడని అభిప్రాయపడ్డాడు. మహమ్మద్ షమీ 64 టెస్ట్ మ్యాచ్‌ల్లో 229 వికెట్లు పడగొట్టాడు. సీమ్ పొజిషన్‌తో పాటు రివర్స్ స్వింగ్‌ను షమీ అద్భుతంగా రాబడుతాడని చెప్పాడు. 'బుమ్రా ప్రతిభావంతుడు. ప్రత్యేకమైన బౌలర్. కానీ సీమ్ పొజిషన్ విజయానికి వస్తే.. భారత్‌లో షమీని అధిగమించే బౌలర్ లేడు. కానీ షమీ కాస్త లేజీ. ఫిట్‌నెస్‌పై అతను మరింత ఫోకస్ పెట్టాలి. ఇదే విషయాన్ని ఒకసారి నేను అతనికి చెప్పాను. మరింత వేగంగా బౌలింగ్ చేసేందుకు ఫిట్‌గా మారాలని సూచించాను. ఇప్పటికే తాను వేగంగా బౌలింగ్ చేస్తున్నానని సమాధానం చెప్పాడు. షమీ రివర్స్ స్వింగ్‌ను కూడా అద్భుతంగా రాబడుతాడు.' అని చతేశ్వర్ పుజారా చెప్పుకొచ్చాడు.2023 వన్డే ప్రపంచకప్ తర్వాత గాయంతో జట్టుకు దూరమైన మహమ్మద్ షమీ 14 నెలల సుదీర్ఘ నిరీక్షణ తర్వాత భారత జట్టులోకి రీఎంట్రీ ఇచ్చాడు. ఛాంపియన్స్ ట్రోఫీలో భారత విజయంలో కీలక పాత్ర పోషించాడు. ఐపీఎల్ 2025 సీజన్‌లో షమీ.. సన్‌రైజర్స్ హైదరాబాద్ తరఫున దారుణంగా విఫలమయ్యాడు. టెస్ట్ మ్యాచ్‌లకు కావాల్సిన ఫిట్‌నెస్‌ను షమీ సాధించలేకపోయాడు. దాంతో ఇంగ్లండ్ పర్యటనకు షమీని బీసీసీఐ ఎంపిక చేయలేదు. జస్‌ప్రీత్ బుమ్రా, సిరాజ్, ప్రసిధ్ కృష్ణ, అర్ష్‌దీప్ సింగ్, హర్షిత్ రాణాలు ఈ పర్యటనకు ఎంపికయ్యారు. కానీ బుమ్రాకు అండగా మరో ఎండ్‌లో రాణించలేకపోతున్నారు.

# టీమిండియా అరుదైన ఘనత



ఇంగ్లాండ్‌లో లీడ్స్ వేదికగా జరుగుతున్న టెస్టు మ్యాచ్‌లో భారత జట్టు కొత్త రికార్డులను సృష్టిస్తోంది. సోమవారం నాలుగో రోజు ఆటలో టీమిండియా అరుదైన ఘనతను సాధించింది. 93 ఏళ్ల భారత టెస్టు చరిత్రలో గిల్ నాయకత్వంలోని జట్టు కొత్త మైలు రాయిని అధిగమించింది. భారత జట్టు 1932లో టెస్టు క్రికెట్ ఆడటం ప్రారంభించింది. అప్పటి నుంచి ఇప్పటివరకు దాదాపు 93 సంవత్సరాలు గడిచాయి. ఈ కాలంలో టీమిండియా మొత్తం 591 టెస్టు మ్యాచ్‌లు ఆడింది. కానీ, ఈ సుదీర్ఘ ప్రయాణంలో ఒకే మ్యాచ్‌లో ఐదుగురు భారత బ్యాటర్లు శతకాలు చేయడం ఎప్పుడూ జరగలేదు. అయితే ఇప్పుడు, శుభ్‌మన్ గిల్ కెప్టెన్సీలో ఆ చరిత్ర తిరగరాశారు. లీడ్స్‌లో ఇంగ్లాండ్‌పై జరుగుతున్న తొలి టెస్టులో భారత బ్యాటర్లు అద్భుత ప్రదర్శనతో ఆ ఘనతను సాధించారు. తొలి ఇన్నింగ్స్‌లో యశస్వి జైస్వాల్ (101), శుభ్‌మన్ గిల్ (147), రిషభ్ పంత్ (134) సెంచరీలు చేయగా, రెండో ఇన్నింగ్స్‌లో కేఎల్ రాహుల్ (137), పంత్ మళ్లీ 118 పరుగులు బాదేశారు. ఇలా ఒకే టెస్టు మ్యాచ్‌లో ఐదుగురు ఆటగాళ్లు శతకాలు చేయడం భారత క్రికెట్ చరిత్రలో తొలిసారి. కాగా, లీడ్స్‌లో జరుగుతున్న టెస్ట్ గిల్‌కు కెప్టెన్‌గా తొలి మ్యాచ్. ఈ మ్యాచ్ గిల్‌కి కెప్టెన్‌గా కలిసి వచ్చి తొలి ఇన్నింగ్స్‌లోనే శతకం కొట్టాడు. అంతేకాకుండా ఐదుగురు సెంచరీలు కొట్టడం ద్వారా తన నాయకత్వంలో జట్టు చరిత్రను సృష్టించింది.మరోవైపు రిషభ్ పంత్ కూడా ఈ మ్యాచ్‌లో మరో అరుదైన రికార్డు సాధించాడు. టెస్టు మ్యాచ్‌లో రెండు ఇన్నింగ్స్‌ల్లోనూ శతకం బాదిన రెండో వికెట్ కీపర్‌గా గుర్తింపు పొందాడు. అంతేకాకుండా, విదేశాల్లో ఈ ఘనత సాధించిన తొలి వికెట్ కీపర్ కూడా పంతే కావడం విశేషం. లీడ్స్‌లో భారత జట్టు ఇంగ్లాండ్‌కు 371 పరుగుల లక్ష్యాన్ని నిర్దేశించింది. నాలుగో రోజు ఆట ముగిసే సమయానికి ఇంగ్లాండ్ వికెట్ కోల్పోకుండా 21 పరుగులు దక్కించుకుంది. ఈ మ్యాచ్ గెలవాలంటే ఇంగ్లాండ్ 350 పరుగులు చేయాల్సి ఉంది. అయితే ఇంగ్లీష్ టీమ్ ఈ లక్ష్యాన్ని చేరుకోవడం అంత సులువు కాదని గత గణాంకాలు చెబుతున్నాయి. గత 77 ఏళ్లలో లీడ్స్‌లో 371 పరుగుల లక్ష్యాన్ని ఛేధించిన టీమ్ ఏదీ లేదు. ఒకవేళ ఇంగ్లాండ్ జట్టు గెలిస్తే మాత్రం 77 ఏళ్ల చరిత్రను తిరిగి రాసినట్లే అవుతుంది.



# ఒలింపిక్ స్వర్ణానికి రూ 6 కోట్లు

## రాష్ట్ర విజేతలకిచ్చే ప్రోత్సాహకాలు భారీగా పెంపు

తెలంగాణ ప్రభుత్వ కొత్త క్రీడా పాలసీలో నగదు ప్రోత్సాహకాలను భారీగా పెంచారు. గతంలో ఒలింపిక్స్‌లో స్వర్ణం సాధిస్తే ఇచ్చే రూ.2 కోట్లను తాజా పాలసీలో రూ.6 కోట్లకు, ఆసియా క్రీడల్లో పసిడి పతకం గెలిస్తే ఇచ్చే రూ.30 లక్షలను రూ.3 కోట్లకు గణనీయంగా పెంచారు. ఇకపై ఒలింపిక్స్‌లో రజతానికి రూ.4 కోట్లు, కాంస్యానికి రూ.2 కోట్లు, ఆసియా క్రీడల్లో రజతానికి రూ. కోటిన్నర, కాంస్యానికి రూ.75 లక్షలు ఇవ్వనున్నారు. కామన్వెల్త్ క్రీడలకు గతంలో స్వర్ణానికి రూ.25 లక్షలు ఉండగా, తాజాగా రూ. కోటిన్నరకు పెంచారు. రజతానికి రూ.75 లక్షలు, కాంస్యానికి రూ.50 లక్షలు అందిస్తారు. సాధారణ క్రీడాకారులతో సమానంగా ఎలాంటి వ్యత్యాసం లేకుండా పారా అథ్లెట్లకు కూడా ఇవే నగదు బహుమతులను అందించనున్నామని శాట్ చైర్మన్ శివసేనారెడ్డి చెప్పారు. అంతర్జాతీయ పోటీల్లో నిలకడగా రాణిస్తున్న క్రీడాకారులను గుర్తించి వారికి ప్రత్యేకంగా ఆర్థిక, శిక్షణ పరంగా సహాయం అందించేందుకు కాంపిటేటివ్ అండ్ హైపెర్ఫామెన్స్ స్పోర్ట్స్ బోర్డును ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు.

# రింకూ సింగ్ వివాహం వాయిదా!



భారత క్రికెటర్ రింకు సింగ్, సమాజ్‌వాదీ పార్టీ ఎంపీ ప్రియా సరోజ్‌ల పెళ్లి వాయిదా పడింది. మొదట వీరిద్దరూ నవంబర్‌లో పెళ్లి చేసుకోవాలని భావించారు. ఇటీవల ఎంగేజ్మెంట్ ఘనంగా జరిగింది. ఒక మీడియా నివేదిక ప్రకారం, నవంబర్ నెలలో రింకు సింగ్ బిజీ షెడ్యూల్ కారణంగా పెళ్లి తేదీని మార్చుతున్నారు. ఈ నెలలో లక్నోలో రింకు, ప్రియాల నిశ్చితార్థం జరిగింది, ఇక్కడ వారి రిసెప్షన్‌లో చాలా మంది ప్రముఖులు పాల్గొన్నారు. వీరిలో %ఖూ% మాజీ సీఎం అఖిలేష్ యాదవ్, రాజ్యసభ ఎంపీగా ఉన్న జయా బచ్చన్ కూడా ఉన్నారు. ఇప్పుడు అమర్ ఉజాలాలో ప్రచురించబడిన ఒక నివేదిక ప్రకారం, నవంబర్‌లో రింకు సింగ్ బిజీ షెడ్యూల్ కారణంగా పెళ్లిని వాయిదా వేశారు. అమర్ ఉజాలా ప్రకారం, రింకు సింగ్- ప్రియా సరోజ్ కుటుంబ సభ్యులు మాట్లాడుతూ, ఇప్పుడు పెళ్లి ఫిబ్రవరి 2026లో జరుగుతుందని, పెళ్లి కొత్త తేదీని త్వరలో ప్రకటిస్తామని తెలిపారు. మొదట అనుకున్న ప్రకారం నవంబర్ 19న వివాహ వేడుకల కోసం వారణాసిలోని తాజ్ హోటల్‌ను కుటుంబం బుక్ చేసిందని పేర్కొంది. అయితే, రింకు నవంబర్ నెలలో భారత జట్టుకు ప్రాతినిధ్యం వహించనున్నాడు. కనుక రెండు కుటుంబాలు పెళ్లి తేదీని మార్చవలసి వచ్చింది. తాజ్ హోటల్‌ను ఇప్పుడు ఫిబ్రవరి కోసం మళ్లీ బుక్ చేశారని, అయితే తేదీ ఇంకా వెల్లడి కాలేదని కూడా తెలిసింది. జూన్ 8న రింకు సింగ్, ప్రియా సింగ్‌ల నిశ్చితార్థం ఘనంగా జరిగింది. నిశ్చితార్థం తర్వాత, రింకు ఇన్‌స్టాగ్రామ్‌లో పోస్ట్ షేర్ చేస్తూ, తాను చాలా కాలంగా ఈ క్షణం కోసం ఎదురు చూస్తున్నానని చెప్పాడు. రింకు కొంతకాలం క్రితం %ఖూూ% 2025లో కోల్‌కతా నైట్ రైడర్స్ జట్టుకు ప్రాతినిధ్యం వహించాడు. మరోవైపు, ప్రియా సరోజ్ ఉత్తరప్రదేశ్‌లోని సమాజ్‌వాదీ పార్టీ సీటు నుండి మచిలీషహర్ నుండి ఎంపీగా ఉన్నారు. ప్రియా తండ్రి తుఫానీ సరోజ్ కూడా సమాజ్‌వాదీ పార్టీకి చెందిన ప్రముఖ నాయకులలో ఒకరు.

# గోల్డెన్ స్పైక్ విజేత చోప్రా



ఓస్ట్రావా (చెక్ రిపబ్లిక్): డైమండ్ లీగ్ నెగ్గిన జోరుమీదున్న వరల్డ్ చాంపియన్ నీరజ్ చోప్రా వరుసగా రెండో టైటిల్‌ను సొంతం చేసుకొన్నాడు. మంగళవారం జరిగిన ఓస్ట్రావా గోల్డెన్ స్పైక్ ఈవెంట్‌లో జావెలిన్‌ను మూడో త్రోలో 85.29 మీటర్ల దూరం విసిరిన నీరజ్ అగ్రస్థానంలో నిలిచాడు. ఈ టైటిల్ నెగ్గడం చోప్రాకిదే తొలిసారి. మొత్తం 9 మంది టాప్ అథ్లెట్లు పోటీపడ్డ ఈ మెగా ఈవెంట్‌లో దక్షిణాఫ్రికా త్రోయర్ డౌ స్మిత్ (84.12 మీ.) రెండో స్థానంలో, గ్రెనడాకు చెందిన అండర్సన్ పీటర్స్ (83.63 మీ.) మూడో స్థానంలో నిలిచారు.

# చైతూ 25వ సినిమా..
# హిట్ కాంబో రిపీట్




అక్కినేని నాగ చైతన్య తన కెరీర్‌లో మైలురాయి సినిమాకు సిద్ధమవుతున్నారు. ఆయన 25వ చిత్రానికి సంబంధించిన వార్త ఇప్పుడు నెట్టింట హల్‌చల్ చేస్తోంది. గతంలో నాగ చైతన్య, సమంత జంటగా 'మజిలీ' వంటి హిట్ చిత్రాన్ని అందించిన దర్శకుడు శివ నిర్వాణ ఈ ప్రతిష్ఠాత్మక చిత్రానికి దర్శకత్వం వహించనున్నారు. టాలీవుడ్‌లో అగ్ర నిర్మాణ సంస్థల్లో ఒకటైన మైత్రీ మూవీ మేకర్స్ ఈ చిత్రాన్ని నిర్మిస్తోంది.ప్రస్తుతం ఈ సినిమాకు సంబంధించిన పనులు వేగంగా జరుగుతున్నాయని సమాచారం. నిర్మాణ సంస్థ ఇప్పటికే ఈ ప్రాజెక్ట్‌ను ముందుకు తీసుకెళ్లే పనుల్లో నిమగ్నమై ఉందని, దర్శకుడు శివ నిర్వాణ ప్రస్తుతం సినిమాకు సంబంధించిన స్క్రిప్ట్ పనుల్లో బిజీగా ఉన్నారని తెలిసింది. 'మజిలీ' తర్వాత నాగ చైతన్య, శివ నిర్వాణ కలయికలో వస్తున్న సినిమా కావడంతో ప్రేక్షకుల్లో, ఇండస్ట్రీ వర్గాల్లో మంచి అంచనాలు నెలకొన్నాయి.

ఈ చిత్రాన్ని హృద్యమైన, భావోద్వేగభరితమైన యాక్షన్ డ్రామాగా తీర్చిదిద్దనున్నారని చిత్ర వర్గాలు చెబుతున్నాయి. అన్ని కార్యక్రమాలు పూర్తి చేసి, ఈ ఏడాది చివరి నాటికి సినిమా రెగ్యులర్ షూటింగ్‌ను ప్రారంభించాలని దర్శక నిర్మాతలు యోచిస్తున్నారు. నాగ చైతన్య కెరీర్‌లో 25వ సినిమా కావడం, విజయవంతమైన కాంబినేషన్ పునరావృతం అవుతుండటంతో ఈ ప్రాజెక్ట్‌పై సర్వత్రా ఆసక్తి నెలకొంది. త్వరలోనే నటీనటులు, ఇతర సాంకేతిక నిపుణుల వివరాలు వెల్లడయ్యే అవకాశం ఉంది.

# ప్రేమలో మునిగితే, తికమక ఖాయం



గత కొన్నాళ్లుగా కోలీవుడ్ స్టార్ హీరో విజయ్, త్రిష కు సంబంధించిన వార్తలు సోషల్ మీడియాలో తెగ వినిపిస్తున్నాయి. విజయ్, త్రిష ఇద్దరూ రిలేషన్ లో ఉన్నారని పుకార్లు బాగా వస్తున్నాయి. ఆ పుకార్లకు తగ్గట్టుగానే త్రిష రీసెంట్ గా విజయ్ పుట్టినరోజున ఇద్దరూ కలిసి దిగిన ఓ స్పెషల్ ఫోటోను షేర్ చేస్తూ దానికి హగ్ ఎమోజీని జోడించి మరీ అతనికి విషెస్ తెలిపింది. అక్కడితో అయిపోలేదు. త్రిష షేర్ చేసిన ఆ ఫోటోకు ఆమె తల్లి కూడా లవ్ సింబల్స్ ను యాడ్ చేసి ఇన్‌స్టాలో స్టోరీ పెట్టింది. దీంతో త్రిష, విజయ్ మధ్య ప్రేమ నడుస్తుంని అందరూ ఫిక్స్ పోయారు. గత కొన్నాళ్లుగా వీరిద్దరూ డేటింగ్ చేస్తున్నారని పలుమార్లు మీడియాలో వార్తలొచ్చినప్పటికీ ఈ విషయంపై వారిద్దరూ ఎప్పుడూ ఖండించకపోవడం గమనార్హం.అయితే ఈ రూమర్లపై ఇప్పుడు త్రిష ఇన్‌డైరెక్ట్ గా రెస్పాండ్ అయింది. ఇన్‌స్టాలో త్రిష ప్రేమపై ఓ ఓ స్టోరీ పెట్టగా ఇప్పుడు ఆ స్టోరీ హాట్ టాపిక్ గా మారింది. ప్రేమలో మునిగిపోతే, అది మిగిలిన అందరినీ తికమకకు గురిచేస్తుందని ఆ స్టోరీలో త్రిష పోస్ట్ చేసింది. త్రిష, విజయ్ ప్రేమలో ఉన్నారని వార్తలు ఎక్కువవుతున్న నేపథ్యంలోనే త్రిష ఈ స్టోరీ పెట్టిందని నెటిజన్లు అభిప్రాయపడుతున్నారు. అయితే త్రిష, విజయ్ లవ్ లో ఉన్నారనే వార్తలు ఇప్పుడు కొత్తగా పుట్టుకొచ్చినవి కాదు. ఎప్పట్నుంచో ఈ గాసిప్స్ వినిపిస్తూనే ఉన్నాయి. వీరిద్దరూ కలిసి ప్రయాణించడం, హీరోయిన్ కీర్తి సురేష్ పెళ్లికి గోవా వెళ్లడం కూడా ఆ వార్తలకు ఆజ్యం పోశాయి. త్రిష, విజయ్ కలిసి మొదటిసారిగా 2004లో గిల్లీ అనే సినిమాలో నటించగా, ఆ తర్వాత 2006లో ఆది అనే సినిమా చేశారు. రీసెంట్ గా లియో సినిమా చేయగా, గతేడాది విజయ్ నటించిన గోట్ సినిమాలో కూడా త్రిష స్పెషల్ సాంగ్ చేసింది. తన ఇన్నేళ్ల కెరీర్లో ఎప్పుడూ చేయని స్పెషల్ సాంగ్ కూడా త్రిష విజయ్ కోసమే చేసిందని వార్తలొచ్చిన సంగతి తెలిసిందే.

# వెంకీ 365 రోజులు.. 4 సినిమాలు



సంక్రాంతికి వస్తున్నాం సినిమాతో బ్లాక్ బస్టర్ ను ఖాతాలో వేసుకున్న విక్టరీ వెంకటేష్, రీసెంట్ గానే రానా నాయుడు వెబ్‌సిరీస్ సీజన్2తో ప్రేక్షకులను పలకరించాడు. మొదటి సీజన్ తో వెంకీ ఇమేజ్ కు జరిగిన డ్యామేజ్ ను దృష్టిలో పెట్టుకుని ఈ సీజన్ ను మరింత జాగ్రత్తగా తెరకెక్కించారు. రానా నాయుడు2 తో ఆడియన్స్ ను అలరించిన వెంకీ ఇప్పుడు యంగ్ హీరోలకు పోటీగా సినిమాలను లైన్ లో పెట్టాడు. ప్రస్తుతం వెంకీ చేతిలో ఒకటి కాదు, రెండు కాదు ఏకంగా నాలుగు క్రేజీ ప్రాజెక్టులున్నాయి. అయితే వెంకీ చేతిలో ఉన్న ఈ నాలుగు సినిమాలు సంవత్సరం కాలంలో రానుండటం విశేషం. వాటిలో ముందుగా అనిల్ రావిపూడి దర్శకత్వంలో మెగాస్టార్ చిరంజీవి చేస్తున్న మెగా157 రానుంది. 2026 సంక్రాంతికి రిలీజ్ కానున్న ఈ సినిమాలో వెంకటేష్ క్యామియో చేయనున్నాడని తెలిసిందే. ఈ మూవీ కోసం వెంకీ ఏకంగా మూడు నుంచి నాలుగు వారాల కాల్షీట్స్ కూడా ఇచ్చాడని సమాచారం.మెగా157 తర్వాత అందరూ ఎంతగానో వెయిట్ చేస్తున్న త్రివిక్రమ్- వెంకటేష్ కలయికలో రూపొందే సినిమా రిలీజ్ కానుంది. త్వరలో షూటింగ్ మొదలుకానున్న ఈ సినిమా 2026 సమ్మర్ లో రిలీజ్ కానున్నట్టు తెలుస్తోంది. గతంలో వెంకటేష్ నటించిన నువ్వు నాకు నచ్చావ్, మల్లీశ్వరి సినిమాలకు రైటర్ గా వర్క్ చేసిన త్రివిక్రమ్, డైరెక్టర్ గా మారాక వెంకీతో కలిసి ఒక్క సినిమా కూడా చేయలేదని అందరూ భావించగా, ఇన్నాళ్లకి వీరిద్దరి కాంబినేషన్ లో సినిమా రానుండటంతో ఈ మూవీపై అందరికీ మంచి అంచనాలు ఏర్పడ్డాయి. దీంతో పాటూ వెంకటేష్ దృశ్యం ఫ్రాంచైజ్ లో భాగంగా రానున్న దృశ్యం3ను కూడా నెక్ట్స్ ఇయర్ లోనే ప్రేక్షకుల ముందుకు తీసుకురానున్నాడని తెలుస్తోంది. దృశ్యం, దృశ్యం2 ఒరిజినల్ వెర్షన్ మలయాళంలో తెరకెక్కగా, ఆ సినిమాలను వెంకీ తెలుగులో రీమేక్ చేశాడు. ఇప్పుడు మలయాళంలో దృశ్యం3 తెరకెక్కుతుంది. అదే సినిమాను వెంకీ తెలుగులో చేయనుండగా, దృశ్యం3 నెక్ట్స్ ఇయర్ అక్టోబర్ లో రిలీజయ్యే అవకాశముంది.

# కీలక సన్నివేశాల చిత్రీకరణలో..



మెగాస్టార్ చిరంజీవి హీరోగా అనిల్ రావిపూడి దర్శకత్వంలో ఓ ఫుల్ కామెడీ ఎంటర్‌టైనర్ రాబోతుంది. ఈ చిత్రంలో నయనతార కథానాయికగా నటిస్తోంది. కాగా ఇటీవలే ముస్సోరీలో రెండవ షెడ్యూల్‌ను పూర్తి చేసుకున్న ఈ చిత్రం మూడవ షెడ్యూల్ ను సోమవారం హైదరాబాద్‌లో ప్రారంభించారు. ఈ షెడ్యూల్‌లో చిరు,- నయనతారలపై కీలక సన్నివేశాలను షూట్ చేస్తారట. ఈ చిత్రంలో కేథరీన్, మాస్టర్ రేవంత్, ఇతరులు కీలక పాత్రల్లో నటిస్తున్నారు. ఈ చిత్రం 2026 సంక్రాంతి పండుగ సందర్భంగా విడుదల కానుంది. కాగా ఈ సినిమా గురించి మెగాస్టార్ ఆ మధ్య మాట్లాడుతూ.. ఈ సినిమా పూర్తిస్థాయి వినోదాత్మక చిత్రమని ఈ మూవీ కథ తనకు నచ్చిందని చెప్పారు. అన్నట్టు, అనిల్ రావిపూడి చెప్పిన సీన్స్ గురించి కూడా మెగాస్టార్ చెబుతూ.. "సినిమాలో ఆయా సన్నివేశాల గురించి అనిల్ రావిపూడి నాకు చెబుతుంటే కడుపుబ్బా నవ్వుకున్నాను. ఈ సినిమా కచ్చితంగా అభిమానులకు నచ్చుతుంది"అని అన్నారు. ఇక సాహు గారపాటి, సుస్మిత (చిరంజీవి కుమార్తె) సంయుక్తంగా ఈ సినిమాని నిర్మిస్తున్నారు.

# దీపిక, మృణాల్, జాన్వీ ఒకే ఫ్రేమ్ లోనా?

ఐకాన్ స్టార్- అట్లీ సినిమాలో హీరోయిన్లు ఫైనల్ అయ్యారా? ముగ్గురు భామల ఎంపిక ప్రక్రియ పూర్త యిందా? అంటే అవుననే లీకులందుతున్నాయి. బన్నీ 22వ చిత్రం ముంబైలో అధికారికంగా ప్రారంభ మైన సంగతి తెలిసిందే. రెగ్యులర్ షూటింగ్ మొదలైందా? లేదా? అన్నది ఇంకా ఎలాంటి సమాచారం లేదు. అలాగే సిని మాలో హీరోయిన్లు ఎవరు ఎంపికయ్యారు? అన్నది కూడా రివీల్ చేయలేదు. అధికారి కంగా దీపికా పదు కొణే ఎంట్రీ ఒక్కటే ఖరారైంది.

మరో ఇద్దరు నాయికలకు కథలో అవకాశం ఉండటంతో ఛాలా మంది భామల పేర్లే తెరపైకి వస్తున్నాయి. జాన్వీ కపూర్, శ్రద్ధా కపూర్, మృణాల్ ఠాకూర్, అనన్య పాండే ఇలా కొంత మంది పేర్లు తెరపైకి వచ్చాయి. కానీ తాజా సమాచారం ఏంటంటే? మరో ఇద్దరు నాయిల్ని కూడా మేకర్స్ ఖరారు చేసినట్లు తెలిసింది. మృణాల్ ఠాకూర్ ని సెకెండ్ లీడ్ కి, థర్డ్ లీడ్ లో జాన్వీ కపూర్ ని ఎంపిక చేసినట్లు వినిపిస్తుంది.

అట్లీ ఇద్దరిపై టెస్ట్ షూట్ నిర్వహించి ఎంపిక చేసాడుట. ఇదే నిజమైతే తెరంతా అందాల జాతరే. దీపిక, మృణాల్, జాన్వీ కపూర్ ఒకే ఫ్రేమ్ లో కనిపిస్తే ఆ రచ్చ ఎలా ఉంటుందో ఊహకే అందదు. ఇంత వరకూ ఈ త్రయం కలిసి నటించింది లేదు. వీళ్లిద్దరికంటే దీపిక సీనియర్. స్టార్ డమ్ పరంగానూ తిరుగులేని నాయిక. కానీ పెర్ఫార్మెన్స్ లో మాత్రం మృణాల్ కి పోటీ కాదు. నటిగా మృణాల్ కే ఎక్కువ మార్కులు పడతాయి.


జాన్వీ కపూర్ తో పోలికి చేసినా? అదే పరిస్థితి. అందుకే మృణాల్ ని సెకెండ్ లీడ్ లో పెట్టినట్లు తెలు స్తోంది. కానీ క్రేజ్ పరంగా చూస్తే జాన్వీ కపూర్ కంటే ఓ మెట్టు కిందనే ఉంటుంది మృణాల్. మరి ఈ సినిమాలో ఈ ముగ్గుర్నీ అట్లీ ఎలా బ్యాలెన్స్ చేస్తాడు? అన్నది చూడాలి. హీరోయిన్లను అందంగా చూపిం చడంలో అట్లీ ఎక్స్ పర్ట్ కాదు. హీరోయిన్ల పాత్రలకు స్కోప్ పర్వాలేదు. మరీ పాటలకే పరిమితం చేయడం.



# అమ్మ ఆరోగ్యం చాలా బాగుంది

## అంజనాదేవి ఆరోగ్యంపై వదంతులు..

## వదంతులను ఖండించిన తనయుడు నాగబాబు



మెగాస్టార్ చిరంజీవి మాతృమూర్తి అంజనాదేవి ఆరోగ్యంపై మంగళవారం ఉదయం నుంచి కొన్ని వదంతులు సామాజిక మాధ్యమాల్లో చక్కర్లు కొట్టాయి. ఆమె అనారోగ్యానికి గురయ్యారని, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ క్యాబినెట్ మీటింగ్ మధ్యలోనే వెళ్లిపోయారని వార్తలు రావడంతో అభిమానులు, శ్రేయోభిలాషులలో ఆందోళన నెలకొంది. ఈ నేపథ్యంలో, ప్రముఖ నటుడు, నిర్మాత నాగబాబు ఈ అంశంపై స్పందించారు. తన తల్లి అనారోగ్యంపై జరుగుతున్న ప్రచారాన్ని ఆయన ఖండించారు.

మంగళవారం ఉదయం కొందరు సామాజిక మాధ్యమం యూజర్లు అంజనాదేవి ఆరోగ్యం బాగోలేదని, ఆమె ఆసుపత్రిలో చేరారని తప్పుడు ప్రచారం చేశారు. 'చిరంజీవి తల్లికి అస్వస్థత', 'చిరంజీవి తల్లి ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు' అంటూ ప్రచారం జరిగింది. దీంతో నాగబాబు స్పందించారు.

"మా అమ్మ అంజనాదేవి గారి ఆరోగ్యం చాలా బాగుంది. ఆమె అనారోగ్యంతో ఉన్నారంటూ వస్తున్న వార్తల్లో ఎలాంటి నిజం లేదు. దయచేసి ఇలాంటి నిరాధారమైన వదంతులను నమ్మవద్దు" అని నాగబాబు తన పోస్టులో పేర్కొన్నారు. ఆరోగ్యం విషయంలో నిర్ధారించుకోకుండా వార్తలు ప్రచారం చేయవద్దని పలువురు నెటిజన్లు కూడా కామెంట్లు చేస్తున్నారు.